www.vishalabharati.com
epaper:vishalabharati.com

సోమవారం, హైదరాబాద్
07 ఆగస్టు 2023
సంపుటి:1 సంచిక:288

# విశాల భారతి

తెలుగు దినపత్రిక



## మణిపుర్‌లో మళ్లీ హింసాత్మక ఘటనలు

- అప్రమత్తమైన కేంద్ర ప్రభుత్వం
- రాష్ట్రానికి సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, ఐటీబీపీ, ఎస్ఎస్‌బీ దళాలు

2

జనం పాట మూగబోయింది. ప్రజాయుద్ధనౌక గద్దర్ ఇకలేరు. అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గద్దర్ తుదిశ్వాస విడిచారు. 1949లో లచ్చమ్మ, శేషయ్య దంపతులకు తూప్రాన్‌లో గద్దర్ జన్మించారు. తెలంగాణ ఉద్యమంలో తన పాటలతో ప్రజల్లో చైతన్యం కల్పించడంలో గద్దర్ ఎంతో కీలకపాత్ర పోషించారు. తన పాటలతో ఉద్యమాలకు ఊపు తెచ్చిన ఘనత గద్దర్ దే. 1987లో కారంచేడులో దళితుల హత్యలను తీవ్రంగా వ్యతిరేకించారు. ఫేక్ ఎన్ కౌంటర్లపై గద్దర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. 1990 ఫిబ్రవరి 18న జన నాట్య మండలి ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని నిజాం కాలేజీ గ్రౌండ్స్ లో గద్దర్ నిర్వహించిన భారి బహిరంగ సభకు 2 లక్షల మంది ప్రజలు హాజరయ్యారంటే ఆయన క్రేజ్ ఏంటన్నది అర్థం చేసుకోవచ్చు.

# మూగబోయిన జనం పాట..



- ప్రజాయుద్ధనౌక అస్తమయం
- గద్దర్ అలియాస్ విఠల్ రావు కన్నుమూత
- మూగబోయిన ఉద్యమ గళం
- సీఎం కేసీఆర్ సహా ప్రముఖుల సంతాపం
- అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు
- సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున నివాళి
- సెలవు ప్రకటించాలని డిమాండ్
- నేడు అంత్యక్రియలు

**విశాలభారతి, హైదరాబాద్:**

1997 ఏప్రిల్ లో గద్దర్ పై పోలీసులు కాల్పులు జరపడంతో ఆయన శరీరంలోకి బుల్లెట్లు గుచ్చుకున్నాయి. ఒక్కటి తప్ప అన్ని బుల్లెట్ లను తొలగించారు. అది తొలగిస్తే ఆయన ప్రాణాలకే ప్రమాదమని కడుపులోనే బుల్లెట్ ను డాక్టర్లు వదిలేశారు. 2010లో తెలంగాణ ఉద్యమంలో చేరకముందు గద్దర్... నక్సలైట్ గా ఉండేవారు. గద్దర్ అసలు పేరు గుమ్మడి విఠల్ రావు. 76 ఏళ్ల వయసులో అనారోగ్యానికి చికిత్స పొందుతూ గద్దర్ కన్ను మూశారు. ఆయన తుదిశ్వాస విడిచినట్టు ఆయన కుమారుడు సూర్యం ధ్రువీకరించారు.

**నా గుండె చప్పుడు ఆగిపోలేదంటూ ఇటీవల గద్దర్ ప్రకటన..**

నా పేరు గుమ్మడి విఠల్ రావు. గద్దర్ నాపాట పేరు. నా బతుకు సుదీర్ఘ పోరాటం. నా వయస్సు 76 సంవత్సరాలు. నా వెన్నుపూసలో ఇరుక్కున్న తూటా వయస్సు 25 సంవత్సరాలు. ఇటీవల నేను పీపుల్స్ మార్చ్ పాదయాత్రకు మద్దతుగా "మా భూములు మాకే" నినాదంతో పాదయాత్రలో పాల్గొన్నాను అని జులై 31న ఓ ప్రకటన విడుదల చేశారు. 'నా పేరు జనం గుండెల చప్పుడు. నా గుండె చప్పుడు ఆగిపోలేదు. కానీ ఎందుకో గుండెకు

..మిగతా | 2 | లో



# మళ్లీ మేమే గెలుస్తాం..

- మా దగ్గర ఇంకా అస్త్రాలున్నాయి
- కాంగ్రెస్ అలమలుకానీ హామీలిస్తోంది.
- వాళ్లు నాలుగు వేల పింఛన్ ఇస్తమంటున్నరు..
- మేం ఐదువేలు ఇస్తామంటే ఏం చేస్తరు?
- విపక్షాలు నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నాయి
- అసెంబ్లీలో సీఎం కేసీఆర్

**విశాలభారతి, హైదరాబాద్:**

తెలంగాణ సీఎం కేసీఆర్ ఇవాళ అసెంబ్లీలో మాట్లాడారు. విపక్షాలపై తీవ్రస్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ వచ్చే ఎన్నికల్లో గెలిచేందుకు అలవి కానీ హామీలిస్తోందని ఫైర్ అయ్యారు. వారు రూ. 4000 పింఛన్ ఇస్తామంటున్నారు.. మేం ఐదువేలు ఇస్తమంటే ఏం చేస్తరు? అని ప్రశ్నించారు. తెలంగాణలో మళ్లీ అధికారం బీఆర్ఎస్ దేనని అన్నారు సీఎం కేసీఆర్. తెలంగాణ అభివృద్ధిపై అసెంబ్లీలో జరిగిన స్వల్పకాలిక చర్చలో ఆయన ప్రసంగించారు. గతంలో కంటే ఏడెనిమిది సీట్లు ఎక్కువే గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. తొమ్మిదేళ్ల తెలంగాణ ప్రగతి ప్రస్థానంలో ఉన్న మైలురాళ్లను ఆయన గుర్తు

..మిగతా | 2 | లో



## బీజేపీ వచ్చాక చేనేత సంఘాలకి ఎన్నికలు

- -ఆత్మహత్యలు చేసుకున్నాక డబ్బులు ఇవ్వటం కాదు.
- -బతికివున్నప్పడే ప్రోత్సాహకాలు ఇచ్చి వారి ఉపాధికి తోడ్పడాలి.
- -బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి.

**విశాలభారతి, రంగారెడ్డి:** చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నాక డబ్బులు ఇవ్వటం కాదు... వారు బతికివున్నప్పుడే ప్రోత్సాహకాలు ఇచ్చి వారి ఉపాధికి తోడ్పడాలని.. చేనేతకు సంబంధించి పథకాలను ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని భారతీయ జనతా పార్టీ రంగారెడ్డి జిల్లా(అర్బన్ ) ఆధ్వర్యంలో వనస్థలిపురంలో నిర్వహించిన కార్యక్రమానికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అందరికీ జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి, చేనేత కార్మిక వ్యవస్థను రక్షించుకోవాలన్నారు. సోమవారం ప్రతిఒక్కరు చేనేత దుస్తులు ధరించాలని, మోదీ కార్యక్రమాన్ని చూడాలని కోరారు. చేనేతకు సంబంధించిన అనేక పథకాలు ప్రధాని ప్రవేశ పెట్టనున్నట్లు తెలిపారు. పోచంపల్లి చీరలు అమెరికా, ఆస్ట్రేలియా, ఇజ్రాయిల్ పంపుతున్నారని.. దీనిపై 15 శాతం నూలు సబ్సిడీ అందిస్తుంటంతో చేనేత కార్మికులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. చేనేత కార్మికుల సంఘానికి ఎన్నికలు నిర్వహించకుండా రాష్ట్ర ప్రభుత్వం మొండికేసిందనీ, 4 నెలల్లో బీజేపీ ప్రభుత్వం వచ్చాక చేనేత సంఘాలకి ఎన్నికలు నిర్వహిస్తామని కిషన్ రెడ్డి తెలిపారు.



## రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ప్రశ్నార్థకంగా మారింది..

- అతి తక్కువ రోజులు మాత్రమే నడిచిన తెలంగాణ అసెంబ్లీ
- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

**హైదరాబాద్‌విశాల భారతి:** అతి తక్కువ రోజులు మాత్రమే తెలంగాణ అసెంబ్లీ నడిచిందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క విమర్శించారు. ఒక రోజు సంతాప తీర్మానం, మూడు రోజులు చర్చ జరిగిందని తెలిపారు. శాసనసభ వాయిదా పడిన తర్వాత అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. "అసెంబ్లీలో చర్చ ఏకపక్షంగా జరిగింది. ప్రతిపక్షాలను

..మిగతా | 2 | లో



## ఫలించిన కోమటిరెడ్డి కృషి..

- జనగామ రైల్వేస్టేషన్ అభివృద్ధికి శంకుస్థాపన
- నేను ఒకరోజు ముందు అడిగినా ప్రధాని అపాయింట్మెంట్ ఇస్తారు
- కేసీఆర్ అపాయింట్మెంట్ ఇవ్వట్లేదు కాబట్టే కేంద్రం వద్దకు వెళ్లాల్సి వస్తుంది
- బీఆర్ఎస్, బీజేపీలకు ఇది సాధ్యం కాలేదు
- ఎంపీ, ఎమ్మెల్యే, మంత్రి ఎవరైనా కేంద్రంతో చర్చలు జరిపితేనే అభివృద్ధి
- కాంగ్రెస్ నేత, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

2

## తెలంగాణ ఎస్ఐ తుది ఫలితాలు విడుదల




- 587 పోస్టులకు ఎన్నికైన వారి జాబితా విడుదల
- నియామక బోర్డు ప్రకటన

**హైదరాబాద్‌విశాల భారతి:** రాష్ట్రంలో ఎస్ఐ, ఏఎస్ఐ పోస్టుల తుది ఫలితాలను టీఎస్ఎల్‌పీఆర్‌బీ విడుదల చేసింది. 587 పోస్టులకు ఎన్నికైన వారి జాబితా ప్రకటించింది. 434 మంది పురుషులు, 153 మంది మహిళలు ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక మండలి తెలిపింది. గతసంవత్సరం సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులకు.. ఏప్రిల్ 25న టీఎస్ఎల్‌పీఆర్‌బీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆగస్టు 7న ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించగా.. దాదాపు 2.47 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు. అక్టోబర్ 2022లో సివిల్ ఎస్ఐ ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలను తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ నియామక మండలి విడుదల చేసింది. ఈ పరీక్షలో 46.80 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. అనంతరం వీరికి దేహధారుడ్య పరీక్షలు నిర్వహించి.. అందులో ఉత్తీర్ణులైన వారికి తుదిరాత పరీక్ష నిర్వహించింది. ఇటీవలే ఆ ఫలితాలను కూడా విడుదల చేశారు. అందులో ఎస్ఐ సివిల్ 43,708 మంది, ఎస్ఐ ఐటీ

..మిగతా | 2 | లో

## ఆర్టీసీ ఉద్యోగుల విలీన బిల్లుకు శాసనసభ ఆమోదం

- రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడి
- గవర్నర్ తెలిసీ తెలియక వివాదం చేశారు : సీఎం కేసీఆర్
- ఆర్టీసీ ఉద్యోగులకు పీఆర్సీ ఇస్తాం

వివరాలు | 2 | లో



# మణిపుర్‌లో మళ్లీ హింసాత్మక ఘటనలు

**నేషనల్ బ్యూరో-విశాల భారతి:**
మణిపుర్‌లో మళ్లీ హింసాత్మక ఘటనలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో కేంద్రం అప్రమత్తమైంది. అదనంగా 10 కంపెనీల బలగాలను ఆగమేఘాల మీద రాష్ట్రానికి పంపింది. ఆదివారం వేకువ జామునాటికే వాళ్లంతా మణిపుర్ చేరుకున్నారు. అక్కడి నుంచి స్థానిక అధికారుల సూచన మేరకు వివిధ జిల్లాలకు వెళ్లారు. కేంద్రం పంపించిన బలగాల్లో సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, ఐటీబీపీ, ఎస్ఎస్‌బీ దళాలకు చెందిన వారున్నారు. శనివారం బిష్ణుపుర్ జిల్లాలో దుండగులు జరిపిన కాల్పుల్లో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. మృతులను క్వాక్టా ప్రాంతానికి చెందిన మైతేయ్ వర్గీయులుగా గుర్తించారు. రాష్ట్రంలో పరిస్థితులు మెరుగుపడటంతో శుక్రవారమే వాళ్లంతా ఇళ్లకు చేరుకున్నారు. అర్ధరాత్రి గాఢ నిద్రలో ఉన్నవారిపై దుండగులు కాల్పులు జరిపి హతమార్చారు. విషయం వెలుగులోకి వచ్చిన తర్వాత ఆగ్రహించిన మైతేయ్ వర్గీయులు కుకీ వర్గానికి చెందిన ఇళ్లకు నిప్పు పెట్టారు. ఇలాంటి ఘటనలు పునరావృతమయ్యే అవకాశాలుండటంతో కేంద్రం అదనపు బలగాలను రంగంలోకి దించింది. మే 3న మైతేయ్, కుకీ వర్గాల మధ్య తలెత్తిన ఘర్షణ ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. అక్కడి హింసాత్మక పరిస్థితులు పెచ్చుమీరుతుండటంతో కేంద్ర రక్షణశాఖ, హోంశాఖ దాదాపు 40 వేల మంది ఆర్మీ, పారామిలటరీ దళాలతోపాటు కేంద్ర సాయుధ పోలీసు బలగాలను (సీఏపీఎఫ్) రాష్ట్రంలో మోహరించింది. దీంతో అక్కడక్కడా ఘర్షణలు తలెత్తినా.. హింస చోటు చేసుకోవడం తగ్గింది. తాజాగా ముగ్గురు మైతేయ్ వర్గానికి చెందిన వారిని కాల్చి చంపడంతో కేంద్రం మరోసారి భద్రతను కట్టుదిట్టం చేసింది. మరోవైపు కొన్ని మహిళా సంస్థలు భద్రతా బలగాల కార్యకలాపాలకు అడ్డంకులు సృష్టిస్తున్నాయని సీఏపీఎఫ్ పేర్కొంది. కేంద్ర, రాష్ట్ర బలగాలను అడ్డుకునేందుకు తరచూ రోడ్లు బ్లాక్ చేస్తున్నారని, అందువల్ల విధినిర్వహణ కష్టమవుతోందని తెలిపింది

# మళ్లీ మేమే గెలుస్తాం..

**మొదటిపేజీ తరువాయి**
చేశారు. సాగునీరు, తాగునీరు, వ్యవసాయం, ఉపాధి వంటి రంగాల్లో వచ్చిన మార్పులను ప్రస్తావించారు.
అలవికాని హామీలును తామెప్పుడూ ఇవ్వలేదని, అదే సమయంలో ప్రతిపక్షాలు అల్లాడిపోయే అస్త్రాలు తమ దగ్గర చాలానే ఉన్నాయని గుర్తు చేశారు సీఎం కేసీఆర్. సమయం వచ్చినప్పుడు వాటిని బయటకు తీస్తామన్నారు. సమయం వచ్చినప్పుడు పింఛన్లు పెంచుతామని చెప్పారు. ఆర్థిక వనరులు సమకూరగానే మళ్లీ ఉద్యోగుల జీతాలు పెంచుతామని చెప్పారు. దేశం ఆశ్చర్యపోయేలా తెలంగాణలో ఉద్యోగుల పేస్కేలు ఉంటుందని చెప్పారు. రాబోయే రోజుల్లో పథకాలకు అందించే నిధులు కూడా క్రమంగా పెంచుకుంటూ పోతామన్నారు కేసీఆర్. హైదరాబాద్ స్థిరాస్తి రంగంలో ఊహించని అభివృద్ధి జరుగుతోందని, ప్రపంచ స్థాయి స్థిరాస్తి కంపెనీలు ఇక్కడికి వస్తున్నాయని చెప్పారు సీఎం కేసీఆర్. తెలంగాణ ఐటీ ఎగుమతులు రూ.2.47 లక్షల కోట్లకు పెరిగాయని వివరించారు. 7 లక్షల టన్నుల యూరియా వాడే తెలంగాణ ఇవాళ 27లక్షల టన్నులు వాడుతోందని, వ్యవసాయ ఉత్పత్తుల దిగుబడి భారీగా పెరిగిందన్నారు. వరి ఉత్పత్తిలో పంజాబ్ తో పోటీ పడుతున్నామని చెప్పారు.
"తెలంగాణ తలసరి ఆదాయం రూ.3.12లక్షల ఉంటే.. మనం ఏ రాష్ట్రం నుంచి మనం విడిపోయామో.. ఎవరైతే మనల్ని ఎకసెక్కాలు పలికారో.. మీకు పరిపాలన రాదు అన్నరో వారి తలసరి ఆదాయం రూ.2.19లక్షలు. రెండురాష్ట్రాల మధ్య రూ.లక్ష వరకు తేడా ఉంది." అంటూ ఏపీతో పోలిక చెప్పారు సీఎం కేసీఆర్.

**కేంద్రం సహకారం లేకపోయినా..**
తెలంగాణ అభివృద్ధిలో కేంద్రం సహకారం ఇసుమంతైనా లేదాన్నారు సీఎం కేసీఆర్. కానీ కేంద్రం అవార్డులు మాత్రం ఇస్తోందని గుర్తు చేశారు. వరదల వల్ల హైదరాబాద్ లో తీవ్ర నష్టం జరిగితే కేంద్రం ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు. వరదల్లో బండి పోతే బండి ఇస్తాం, గుండు పోతే గుండు ఇస్తాం అన్న వ్యక్తి జాడే లేదని, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మిస్తుంటే 420 కేసులు వేశారని, అభివృద్ధిని అడ్డుకోవాలని చూశారని చెప్పారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టకపోతే ఎఫ్ఆర్‌బీఎం నిధుల్లో కేంద్రం కోత విధించిందని, దీనివల్ల తెలంగాణ ప్రతి ఏటా 5వేల కోట్ల రూపాయలు నష్టపోతోందని చెప్పారు కేసీఆర్.

# ఆర్టీసీ ఉద్యోగుల విలీన బిల్లుకు శాసనసభ ఆమోదం

**హైదరాబాద్‌విశాల భారతి:** ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనం బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. గవర్నర్ తమిళిసై అనుమతి ఇవ్వడంతో ఆర్టీసీ ఉద్యోగుల విలీనం బిల్లును ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని మంత్రివర్గం నిర్ణయించిందని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. ఆర్టీసీ కార్యకలాపాలు ఎప్పటిలాగానే కొనసాగుతాయన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల విలీనం వల్ల ప్రభుత్వంపై ఏటా 3 వేల కోట్లు భారం పడనుందని వివరించారు. ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే పీఆర్‌సీ ఆర్టీసీ ఉద్యోగులకూ వర్తిస్తుందని పువ్వాడ అజయ్ కుమార్ తెలిపారు. ఆర్టీసీ కార్పొరేషన్, దాని ఆస్తులు యథాతథంగా కొనసాగుతాయని పేర్కొన్నారు. కార్మికుల బకాయిలను కూడా చెల్లిస్తున్నామన్నారు. ఉద్యోగులతో చర్చించి పదవీ విరమణ ప్రయోజనాలు నిర్ణయిస్తామని వ్యాఖ్యానించారు. ఆర్టీసీలో ప్రస్తుతం 43 వేల 55 మంది ఉద్యోగులు ఉన్నట్లు పువ్వాడ అజయ్‌కుమార్ సభకు తెలిపారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు కార్పొరేషన్ రూల్స్ ప్రకారం కొనసాగుతారని స్పష్టతనిచ్చారు. సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయానికి రుణపడి ఉంటామని ఆర్టీసీ ఛైర్మన్ బాజిరెడ్డి గోవర్దన్ తెలిపారు. సంస్థను ప్రైవేటు పరం చేస్తామని దుష్ప్రచారం చేశారన్న బాజిరెడ్డి.. ఆర్టీసీ ఆస్తులు అమ్ముతున్నారని కూడా దుష్ప్రచారం చేశారన్నారు. ఆర్టీసీని నష్టాల్లోంచి గట్టెక్కించేందుకు ఎంతో కృషి చేశామని పేర్కొన్నారు. ఆర్టీసీకి ఏటా రూ.1250 కోట్లు నష్టం వస్తోందని వెల్లడించారు. ఆర్టీసీ ఉద్యోగుల జీవితాల్లో వెలుగునింపుతున్న సీఎంకు ఈ సందర్భంగా బాజిరెడ్డి గోవర్ధన్ ధన్యవాదాలు తెలిపారు. చర్చ అనంతరం ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనం బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. పురపాలక చట్ట సవరణ బిల్లు, పంచాయతీ రాజ్ చట్ట సవరణ బిల్లుకూ అసెంబ్లీ ఆమోద ముద్ర వేసింది.

**గవర్నర్‌కు ధన్యవాదాలు..**
ఆర్టీసీ బిల్లుపై గవర్నర్ తెలిసీ తెలియక వివాదం చేశారని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. ఆర్టీసీ పెట్టిందే ప్రజారవాణా ఉండాలని.. కాలక్రమంలో ఆ సంస్థ నష్టాల్లో కూరుకుపోయిందన్నారు. ఆర్టీసీ ఆస్తులపై కన్నేశామని కొంతమంది విమర్శిస్తున్నారన్న కేసీఆర్.. అది పూర్తిగా అవాస్తవమని కొట్టిపారేశారు. ప్రభుత్వ పరంగా ఆర్టీసీని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. బస్ స్టేషన్లను ఆధునికీకరిస్తామన్న ఆయన.. అవసరమైతే మరి కొంత భూమి సేకరిస్తామన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు పీఆర్‌సీ ఇస్తామని స్పష్టం చేశారు. గవర్నర్ గారు పనిలేని పని పెట్టుకొని 96 క్లారిఫికేసన్లు అడిగారన్న ముఖ్యమంత్రి కేసీఆర్.. చివరికి గవర్నర్‌గారికి జ్ఞానోదయమై ఆర్టీసీ బిల్లు ఓకే చేసి పంపించారన్నారు. ఆర్టీసీ కార్మికుల పక్షాన, తన పక్షాన సీఎం కేసీఆర్ గవర్నర్ గారికి ధన్యవాదాలు తెలిపారు.




# గద్దర్ మరణాన్ని తట్టుకోలేక పోతున్నా..

- అన్నతో నాకు వ్యక్తిగతంగా ఎంతో సాన్నిహిత్యం ఉంది
- నాలాంటి వారికి ఉద్యమ స్ఫూర్తిని నింపిన కవి
- రాహుల్‌కు అన్న పెట్టిన ముద్దు ఇంకా తడి ఆరలేదు
- టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి

**హైదరాబాద్‌విశాల భారతి:** ప్రజా యుద్ధ నౌక గద్దర్ మరణంపై టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గద్దర్ ఆకస్మిక మరణాన్ని తట్టుకోలేక పోతున్నామన్నారు. ఇటీవల జరిగిన ఖమ్మం జనగర్జన సభలో గద్దర్ రాహుల్ గాంధీతో ఎంతో ఆప్యాయంగా ఉన్నారని గుర్తు చేసుకున్నారు. గాంధీ కుటుంబం పట్ల అపార అభిమానులు ఉన్న వ్యక్తి గద్దర్ అని చెప్పారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర పోరాట యోధుడు.. తెలంగాణ సాధన కోసం తన ఆట, పాటలతో జనాన్ని ఎంతో ఉతేజపరిచిన వ్యక్తి గద్దర్ అని రేవంత్ రెడ్డి అన్నారు. 'తన పాటతో తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తినిచ్చారు. ఆయన పాటతో మలిదశ ఉద్యమం ఉవ్వెత్తున ఎగసింది. పీడిత, తాడిత ప్రజల పక్షాన గళమై వినిపించారు గద్దర్. భూమి, ఆకాశం ఉన్నంతవరకు ఆయన ఇచ్చిన స్ఫూర్తి ఉంటుంది. గద్దర్ అన్నతో నాకు వ్యక్తిగతంగా ఎంతో సాన్నిహిత్యం ఉంది. నాలాంటి వారికి ఉద్యమ స్ఫూర్తిని నింపిన కవి, కళాకారుడు ఆయన. తుది దశ తెలంగాణ ఉద్యమం కోసం చివరి శ్వాస వరకు పరితపించారు. దొరల నుంచి తెలంగాణను కాపాడాలని తుది దశ ఉద్యమానికి అండగా నిలబడ్డారు. రాహుల్ కు గద్దర్ అన్న పెట్టిన ముద్దు ఇంకా తడి ఆరలేదు. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోవడం బాధాకరం' అని ఆవేదన వ్యక్తం చేశారు. గద్దరన్న అంతిమ యాత్ర సోమవారం ఉదయం 11 గంటలకు మొదలవుతుందని, ఎల్బీ స్టేడియం నుండి బషీర్ బాగ్ చౌరస్తా, జగ్జీవన్ రామ్ విగ్రహం మీదుగా గన్ పార్క్ వైపు సాగుతుంది రేవంత్ రెడ్డి అన్నారు. గన్ పార్కులోని అమరవీరుల స్థూపం వద్ద గద్దర్ పార్థివ దేహాన్ని ఉంచి పాటలతో నివాళులు అర్పిస్తారని తెలిపారు. అమరవీరుల స్థూపం నుండి భూదేవినగర్ లోని గద్దర్ నివాసానికి పార్థివదేహం చేరుకుంటుందని చెప్పారు. భూదేవినగర్ లోని మహాభారతి విద్యాలయం అవరణలో గద్దర్ అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు చెప్పారు. అంత్యక్రియలకు వేలాదిగా తరలివచ్చి గద్దర్ కు నివాళులు అర్పించాలని రేవంత్ రెడ్డి కోరారు. తుది దశ ఉద్యమానికి ఆయన ఇచ్చిన స్ఫూర్తిని నింపుకుని ఆయన కలలు కన్న తెలంగాణకై పోరాడదాం అంటూ ప్రజలకు రేవంత్ పిలుపునిచ్చారు. కాగా, గద్దర్ మృతికి సంతాప సూచకంగా కాంగ్రెస్ శ్రేణులు అన్ని మండల కేంద్రాలలో ముఖ్య కూడళ్లలో గద్దర్ చిత్ర పటాలు పెట్టి నివాళులు అర్పించాలని కాంగ్రెస్ శ్రేణులకు రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.



# రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ప్రశ్నార్థకంగా మారింది..

**మొదటిపేజీ తరువాయి**
మాట్లాడనివ్వకుండా గొంతు నొక్కారు. దేశంలోనే అతి తక్కువ రోజులు అసెంబ్లీ సమావేశాలు జరిగిన రాష్ట్రం తెలంగాణే. అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పలేదు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని, ఎమ్మెల్యేలను తిట్టడమే భారాసకు సరిపోయింది. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ప్రశ్నార్థకంగా మారిపోయింది. చట్ట సభలను భారాస కార్యాలయాలుగా మార్చారు'' అని మండిపడ్డారు.

**198 రోజులు మాత్రమే..!**
2014 నుంచి 2023 వరకు రాష్ట్ర ప్రభుత్వం కేవలం 198 రోజులు మాత్రమే సభను నిర్వహించిందని కాంగ్రెస్ ఎమ్మెల్యే శ్రీధర్ బాబు తెలిపారు. కాంగ్రెస్ హయాంలో 500 రోజులు సభను నిర్వహించామని గుర్తుచేశారు. రాజ్యాంగ నిబంధనల మేరకు 6 నెలలు సమయం గడిచిపోతుందని అసెంబ్లీ సమావేశాలు నిర్వహించారని ఆరోపించారు. భారాస ఎమ్మెల్యేలు సభను పక్కదారి పట్టించారన్నారు.

**అధికారిక లాంఛనాలతో గద్దర్ అంత్యక్రియాలు నిర్వహించాలి**
ప్రజాగాయకుడు మృతి పట్ల కాంగ్రెస్ పార్టీ నేతలు సంతాపం వ్యక్తం చేశారు. గద్దర్ అకాల మరణం దిగ్భ్రాంతికి గురి చేసిందని భట్టి విక్రమార్క అన్నారు. సమాజ మార్పు కోసం తన ఆట, పాటతో గద్దర్ పని చేశారని.. తెలంగాణ ఉద్యమాన్ని పాటతో చైతన్యం చేశారని కొనియాడారు. గద్దర్ అంతిమ సంస్కరాలను ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో నిర్వహించాలని డిమాండ్ చేశారు.

# ఫలించిన కోమటిరెడ్డి కృషి..




- జనగామ రైల్వేస్టేషన్ అభివృద్ధికి శంకుస్థాపన
- నేను ఒకరోజు ముందు అడిగినా ప్రధాని అపాయింట్మెంట్ ఇస్తారు
- కేసీఆర్ అపాయింట్మెంట్ ఇవ్వట్లేదు కాబట్టే కేంద్రం వద్దకు వెళ్లాల్సి వస్తుంది
- బీఆర్ఎస్, బీజేపీలకు ఇది సాధ్యం కాలేదు
- ఎంపీ, ఎమ్మెల్యే, మంత్రి ఎవరైనా కేంద్రంతో చర్చలు జరిపితేనే అభివృద్ధి
- కాంగ్రెస్ నేత, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

**తెలంగాణ బ్యూరోవిశాల భారతి:** కాంగ్రెస్ నేత, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కృషి ఫలించింది. దేశవ్యాప్తంగా 508 రైల్వేస్టేషన్ల అభివృద్ధి పనులకు ప్రధాని మోడీ ఆదివారం శంకుస్థాపన చేశారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పనులను ప్రారంభించారు. తెలంగాణలోని 21 రైల్వే స్టేషన్ల అభివృద్ధికి శంకుస్థాపన చేశారు. ఈ క్రమంలో జనగామలో నిర్వహించిన కార్యక్రమంలో భువనగిరి పార్లమెంట్ సభ్యులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారు పాల్గొన్నారు. కేంద్రంతో తాను జరిపిన చర్చలు, తీసుకొచ్చిన నిధులపై వివరించారు. భువనగిరితోపాటు జనగామ రైల్వే స్టేషన్ల అభివృద్ధిపై మాట్లాడేందుకు ప్రధాని మోడీ, కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ గారిని కొన్నాళ్ల క్రితం కలిసినట్లు తెలిపారు. దానికి వారు సానుకూలంగా స్పందించి రైల్వే స్టేషన్ల అభివృద్ధిపై త్వరలోనే చర్యలు తీసుకుంటామని చెప్పారని వెల్లడించారు. దేశంలో రైల్వే వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు వందే భారత్ ట్రైన్స్, రైల్వే స్టేషన్ల అభివృద్ధి సహా పలు కార్యక్రమాలు జరుగుతున్నాయని, ప్రజల రద్దీని దృష్టిలో పెట్టుకుని రానున్న రోజుల్లో ఈ రెండు రైల్వే స్టేషన్లు కొత్త మోడల్ లో అభివృద్ధి చేయాలని కోరినట్లు కోమటిరెడ్డి చెప్పారు. ఎంఎంటీఎస్ ట్రైన్ ఘట్ కేసర్ వరకే ఉందని...పొడిగింపులో భాగంగా రాయగిరి వరకే చేయాలని ప్రపోజల్ వచ్చిందని...కానీ, తాను మాట్లాడి ప్రపోజల్ ను మార్పించి యాదగిరి గుట్ట వరకు పొడిగించానని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ వాటా కట్టకుండా ఉంటే ఇలా కుదరదని ప్రధాని మోడీ గారితో చర్చలు జరిపి రాష్ట్రంతో సంబంధం లేకుండా ఎంఎంటీఎస్ పొడిగించాలని కోరినట్లు వెల్లడించారు. దీనిపై కేంద్రమంత్రితో కూడా చర్చలు జరిపినట్లు తెలిపారు. ఇద్దరూ సానుకూలంగా స్పందించారని చెప్పుకొచ్చారు. యాదగిరి గుట్ట వరకు కొత్త లైన్ వేస్తున్నామని చెప్పారు. అలాగే, జనగామ వరకు ఎంఎంటీఎస్ పొడిగిస్తామని హామీ ఇచ్చినట్లు కోమటిరెడ్డి అన్నారు. ఎంపీ అయినా, ఎమ్మెల్యే అయినా, మంత్రి అయినా కేంద్రంతో మాట్లాడి, చర్చలు జరిపితేనే అభివృద్ధి జరుగుతుందని స్పష్టం చేశారు. తెలంగాణలోనే కాదు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనూ ఎక్కువ నిధులు తీసుకొచ్చింది తానే అని అన్నారు. తాను ఒకరోజు ముందు అడిగినా ప్రధాని గారు అపాయింట్ మెంట్ ఇస్తారని..కోమటిరెడ్డి అపాయింట్ మెంట్ అడిగితే అభివృద్ధి గురించే వస్తారని ఆయనకు తెలుసునని వ్యాఖ్యానించారు. అందుకే వెంటనే ఇస్తారని చెప్పారు. కేసీఆర్ ఎలాగూ అపాయింట్ మెంట్ ఇవ్వరు. అందుకే కేంద్రంతో మాట్లాడుకోవాల్సి వస్తోందని విమర్శలు గుప్పించారు. కరోనా కారణంగా మధ్యలో పనులు ఆగినా తర్వాత పనులు చేయించినట్లు తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ ఎంపీలకు కూడా ఇది సాధ్యం కాలేదని, పట్టుదలతో ఇది తాను సాధించానన్నారు. ఎమ్మెల్యేని, జిల్లా మంత్రిని నేడు రమ్మని చెప్పినా రాలేదు. ఇది కరెక్ట్ కాదు అని కోమటిరెడ్డి మండిపడ్డారు.

# తెలంగాణ ఎస్ఐ తుది ఫలితాలు విడుదల

**మొదటిపేజీ తరువాయి**
అండ్ కమ్యూనికేషన్‌కు 729 మంది, ఫింగర్ ప్రింట్ బ్యూరో ఏఎస్ఐ పోస్టులకు 1,153 మంది, పోలీస్ ట్రాన్స్‌పోర్టు ఎస్ఐ పోస్టులకు 463 మంది ఎంపికయ్యారు. ఈ క్రమంలోనే అర్హత సాధించిన వారి ధ్రువపత్రాలను.. జూన్ 14నుంచి 26వరకు పరిశీలించారు. ఈ మేరకు 18 కేంద్రాలను పోలీసులు ఏర్పాటు చేశారు. తుది ఎంపిక జాబితాలో పేరున్నా గానీ.. అప్పుడే ఉద్యోగపత్రం అందుకునే అవకాశం మాత్రం ఉండదు. ఆ జాబితాలో ఉన్న ప్రతి ఒక్కరికి సంబంధించిన నేపథ్యం, ప్రవర్తన, నేరచరిత్ర.. తదితర అంశాలను టీఎస్ఎల్‌పీఆర్‌బీ ఆరాతీయనుంది. ఈ ప్రక్రియను జిల్లాల వారీగా స్పెషల్ బ్రాంచ్ (ఎస్‌బీ) చేపట్టనుంది. మరోవైపు తుది రాత పరీక్షలో కానిస్టేబుల్ ఐటీ అండ్ కమ్యూనికేషన్‌కు 4,564 మంది, డ్రైవర్, ఆపరేటర్ కానిస్టేబుల్ పోస్టులకు 1,779 మంది, పోలీస్ కానిస్టేబుల్ మెకానిక్‌కు 283 మంది చొప్పున అర్హత సాధించారు. వారి ధ్రువపత్రాలను.. జూన్ 14నుంచి 26వరకు పరిశీలించారు. ఈ మేరకు 18 కేంద్రాలను పోలీసులు ఏర్పాటు చేశారు.

> తన జీవితకాలం ప్రజల కోసమే బతికిన ప్రజా వాగ్గేయకారుడు గద్దర్ తెలంగాణ గర్వించే బిడ్డ అని సీఎం శ్రీ కేసీఆర్ అన్నారు.జీవితాంతం వారు చేసిన త్యాగాలు ప్రజా సేవకు గౌరవ సూచకంగా దివంగత గద్దర్ అంత్యక్రియలను ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిర్వహించాలని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు నిర్ణయించారు. ఈ మేరకు గద్దర్ కుటుంబ సభ్యులతో మాట్లాడి సంబంధించిన చర్యలు చేపట్టాలని, అధికారిక లాంచనాలతో అంత్యక్రియలతో జరపాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీమతి శాంతి కుమారిని సీఎం కేసీఆర్ ఆదేశించారు.

> ప్రజా గాయకుడిగా తన పాటలతో పేదల్లో చైతన్యాన్ని నింపి, వారి హక్కుల సాధన కోసం ఉద్యమబాట పట్టిన మహోన్నత వ్యక్తి గద్దర్ గారు. అలాంటి మహనీయుడిని కోల్పోవడం సమాజానికి తీరని లోటు. గద్దర్ గారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ఆయన ఆత్మకు శాంతి కలగాలని దేవుడిని ప్రార్థిస్తున్నాను.
> - వైఎస్ జగన్మోహన్ రెడ్డి

> ఉద్యమ గళం మూగబోయింది. ప్రజా యుద్ధనౌక గద్దర్ గారు కన్నుమూశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆయనతో నాకు మంచి అనుబంధం ఏర్పడింది. నా పోరాటానికి ఆయనే స్ఫూర్తి. ప్రజా సమస్యలపై గద్దర్ గారి పోరాటం అజరామరం. తనదైన పాటలతో ఎంతోమందిని ఉత్తేజ పరిచారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. అనేక పాటలతో ఆనాడు ఉద్యమానికి ఊపు తెచ్చారు. తెలంగాణ ఉద్యమ గళం అయిన గద్దర్ స్మృతిలో.. ఆయనకు నివాళులు అర్పిస్తున్నాను.
> - కోమటిరెడ్డి వెంకటరెడ్డి, భువనగిరి ఎంపీ

> ప్రజాయుద్ధ నౌక, విప్లవ గాయకుడు గద్దర్ అనారోగ్యంతో కన్నుమూశారని తెలిసి తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నాను. తెలంగాణ ఉద్యమంలో తన గొంతుతో ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో కీలకపాత్ర పోషించారు.వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ.. కుటుంబ సభ్యులకు, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.
> జి కిషన్ రెడ్డి ,కేంద్ర మంత్రి రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు

# మూగబోయిన జనం పాట..

**మొదటిపేజీ తరువాయి**
గాయం అయ్యింది. ఈ గాయానికి చికిత్సకై అమీర్ పేట/ బేగంపేట లోని శ్యామకరణ్ రోడులో అపోలో స్పెక్ట్రా (Apollo Spectra) హాస్పిటల్ లో ఇటీవల చేరాను. జూలై ఇరువై నుండి నేటి వరకు అన్నిరకాల పరీక్షలు, చికిత్సలు తీసుకుంటూ కుదుట పడుతున్నాను.
ప్రజా గాయకుడు గద్దర్ మరణంపై ప్రముఖుల దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. ప్రజా యుద్ధ నౌక గద్దర్ మృతి తెలంగాణకు, పీడిత, తాడిత ప్రజలకు తీరని లోటు అని రాష్ట్ర కాంగ్రెస్ నేతలు అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, ఏఐసీసీ ఇంచార్జ్ మానిక్ రావ్ ఠాక్రే, ప్రచార కమిటీ ఛైర్మన్ మధు యాష్కీ, మహేష్ కుమార్ గౌడ్, సీనియర్ ఉపాధ్యక్షలు మల్లు రవి.. గద్దర్ మృతిపట్ల సంతాపం వ్యక్తం చేశారు. దశాబ్దాల కాలంగా ప్రజల కోసం అలుపెరగని పోరాటం చేసిన వ్యక్తి గద్దర్ అని కొనియాడారు. గద్దర్ తెలంగాణ పోరాట యోధుడు.. తెలంగాణ సాధన కోసం తన ఆట, పాటలతో జనాన్ని ఉతేజపరిచారు అని రేవంత్ రెడ్డి అన్నారు. గాంధీ కుటుంబం పట్ల అపార అభిమానం ఉన్న వ్యక్తి గద్దర్. ఇటీవల ఖమ్మంలో రాహుల్ గాంధీతో గద్దర్ ఎంతో ఆప్యాయంగా ఉన్నారని, ఆయన మరణాన్ని తట్టుకోలేక పోతున్నాం అన్నారు రేవంత్ రెడ్డి. గద్దర్ మృతికి సంతాప సూచకంగా కాంగ్రెస్ శ్రేణులు అన్ని మండల కేంద్రాలలో ముఖ్య కూడళ్లలో గద్దర్ చిత్ర పటాలు పెట్టి నివాళులు అర్పించాలని పార్టీ శ్రేణులకు రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.



**రాహుల్ గాంధీ సంతాపం..**
తెలంగాణలో దిగ్గజం, ఉద్యమకారుడు గుమ్మడి విట్టల్‌రావు మరణం తనను చాలా బాధించిందన్నారు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ. తెలంగాణ ప్రజలపై ఆయనకున్న ప్రేమే అణగారిన వర్గాల కోసం అలుపెరగకుండా పోరాడేలా చేసిందన్నారు. ఆయన నుంచి స్ఫూర్తి పొంది మనం ముందుకు సాగాలని రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు.

**పొడుస్తున్న పొద్దు అస్తమించింది - ఎమ్మెల్యే సీతక్క**
పొడుస్తున్న పొద్దు అస్తమించింది అని గద్దర్ మరణంపై ఎమ్మెల్యే సీతక్క స్పందించారు. ఆయన పాట తూపాకీ తూటాలా ఉండేది. ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేది ఆయన ఆట, పాట అని కొనియాడారు. దశాబ్దాల కాలం నుంచి ఆయన జీవితాన్ని పీడిత వర్గాల కోసం, వారిని చైతన్యం చేయడం కోసం కాలికి గజ్జె కట్టి పోరాటం చేసిన గొప్ప వ్యక్తి గద్దర్ అన్నారు. ఇటీవల జరిగిన ఖమ్మం సభలో గద్దర్ ను కలుసుకోగా రాహుల్ గాంధీని అప్యాయంగా హత్తుకున్నారని గుర్తుచేసుకున్నారు. అన్యాయాన్ని ప్రశ్నించే వారి సంఖ్య తగ్గిపోతుందని, కానీ సాటి వారి కోసం పోరాటం కొనసాగించిన ప్రజా యుద్ధనౌక, గాయకుడు గద్దర్ లేకపోవడం రాష్ట్ర సమాజానికి, వెనుకబడ్డ వర్గాలకు తీరని లోటు అని ఎమ్మెల్యే సీతక్క అన్నారు.



## ప్రజా గాయకుడు గద్దర్ మృతి బాధాకరం

**- మల్లేష్ గౌడ్**

చిట్యాల,విశాలభారతి:ప్రజా గాయకుడు గద్దర్ మృతి చెందడం బాధాకరమని కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ మాజీ ఎంపీ మధుయాష్ కే గౌడ్ యువసేన రాష్ట్ర అధ్యక్షులు భక్తుల మల్లేష్ గౌడ్ ఒక ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ స్వరాష్ట్ర సాధన ఉద్యమంలో తన పాటలతో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసేలా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారని అన్నారు. గద్దర్ మరణం తెలంగాణ ప్రజానీకానికి తీరని లోటని ఈ సందర్భంగా తనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

# ధరణి పోర్టల్ ను సరళీకృతం చేయండి..

- **మాదాసి కురువ ఎస్సి సర్టిఫికెట్ల జారీలో తలెత్తుతున్న ఇబ్బందులు పరిష్కరించండి.**
- **అసెంబ్లీలో షాద్ నగర్ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్**



**షాద్ నగర్ విశాలభారతి:** రైతన్నల భూసమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి కెసిఆర్ ధరణి పోర్టల్ తెచ్చాడు. పెద్దపెద్ద సమస్యలు పరిష్కారం అవుతున్న కొన్ని చిన్న సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని,ధరణి పోర్టల్ ను సరళీకృతం చేయడం ద్వారా రైతులకు ఇబ్బందులను దూరం చేయాలని షాద్ నగర్ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఆదివారం శాసనసభ సమావేశాల్లో ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే అంజయ్య షాద్ నగర్ నియోజక వర్గం సమస్యలను సభలో ప్రస్తావించారు.మాదాసి కురువ ప్రజలకు ఎస్సీ సర్టిఫికెట్ల పంపిణీ విషయంలో స్పష్టత ఇవ్వాలని అనేక నియోజకవర్గాల్లో ఎస్సీ సర్టిఫికెట్లు లభిస్తున్నాయని, తమ నియోజకవర్గంలో కూడా ప్రజలు బలంగా కోరుకుంటున్నారని, అధికారులు ఎస్సీ సర్టిఫికెట్లు జారీ చేయకుండా ఇబ్బందులు పెడుతున్నారని ఈ విషయంలో ప్రభుత్వం స్పందించాలని కోరారు.అదేవిధంగా పరిగి రోడ్డులో అనేక రోడ్డు ప్రమాదాలు సంభవించి ఎంతోమంది మృత్యువాత పడుతున్నారని ఈ రెండు లైన్ల రహదారిని నాలుగు లైన్లుగా విస్తరించాలని ప్రభుత్వానికి నివేదించారు. అలాగే ధరణి పోర్టల్ రికార్డులలో అనేక చిన్న చిన్న పొరపాట్లు ఉన్నాయని వాటిని సవరించి రైతులకు పూర్తిస్థాయిలో ఇబ్బందులు తొలగించాలని సభలో కోరారు. ముఖ్యంగా టీఎం 33 మాడ్యుల్ ప్రకారం రైతులు ఎవరైనా భూమి కోసం మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకుంటే పోర్టల్ తిరస్కరిస్తుందని అన్నారు. ఎన్ని సందర్భాల్లో రైతులు దరఖాస్తు మీ సేవల ద్వారా చేసుకున్న అవి తిరస్కరణకు గురవుతున్నాయని పేర్కొన్నారు. అదేవిధంగా మరో సమస్యను లేవనెత్తుతూ పట్టా భూములు కొన్ని ఎండోమెంట్ స్థలాలుగా రికార్డుల్లో ఉన్నాయని, అనేక సందర్భాల్లో వీటి గురించి అధికారులకు వివరించిన వారికి న్యాయం జరగడం లేదని పేర్కొన్నారు. ఎండోమెంట్ కు సంబంధించి అధికారులు 33, 43 రిజిస్టర్ల ప్రకారం సరిచేసుకోవాలని చెబుతున్నప్పటికీ వాటిని కలెక్టర్ తిరస్కరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ పొరపాట్లను సవరించాలని రైతులకు ఇబ్బందులు తొలగించాలని సభ దృష్టికి తెచ్చారు.దీనిపై స్పందించిన రాష్ట్ర పురపాలక, ఐటి శాఖ మంత్రి కేటీఆర్ అసెంబ్లీలో అంజయ్యయాదవ్ ప్రశ్నలకు సమాధానం ఇస్తూ ధరణిలో ఏర్పడిన చిన్నపాటి సమస్యలు తమ దృష్టికి వచ్చాయని, ముఖ్యంగా రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలో కొంతమంది శాసన సభ్యులు ఇదే అంశాన్ని తన వద్ద ప్రస్తావించారని అయితే దీనిపై జిల్లా కలెక్టర్లు, సిసిఎల్ అధికారులు సమీక్ష నిర్వహించి సమస్యలను పరిష్కరించాల్సిందిగా ప్రభుత్వాన్ని ఆదేశిస్తున్నట్లు చెప్పారు. అలాగే పరిగి రోడ్డు నాలుగు లైన్ల రహదారి విస్తరణ సంబంధిత మంత్రి రికార్డు చేశారని సమాధానం చెప్పారు.



## ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు

**వలిగొండ,విశాలభారతి:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహానికి బిఆర్ఎస్,పట్టణ అధ్యక్షులు,ఎమ్మె లింగస్వామి, ఆధ్వర్యంలో ముఖ్య అతిథులుగా యాదాద్రి భువనగిరి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఆయిల్ ఫేడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణ రెడ్డి హాజరై ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సిద్ధాంత రూపకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాలవేసి 89వ జయంతిని ఘనంగా నిర్వహించి ఆయన చేసిన సేవలు మరువ లేనివని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐటిపాముల సత్యనారాయణ పబ్బు వెంకటరమణ ఐటిపాముల ప్రభాకర్, కొండూరు వెంకటేష్. ఎమ్మె లక్ష్మయ్య పోలేపాక బిక్షపతి ఎక్కల దేవి శ్రీనివాస్ పోలేపాక సత్యనారాయణ, మహమ్మద్ అఫ్రోజ్ ఎమ్మె మల్లేశం మైసొల్ల సురేష్, పోలేపాక జానకి రాములు,పబ్బు శేట్టయ్య, మక్తర్ పాషా బూడిద భాస్కర్. కళ్లెం మారాయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఉద్యమకారుల ఆత్మగౌరవ సదస్సును జయప్రదం చెయ్యండి

- **తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్.**

**హైదరాబాద్,విశాలభారతి:**తెలంగాణ రాష్ట్ర సాధన కోసం వీరోచితమైన పోరాటాలు చేసి ఆర్థికంగా నష్టపోయిన ఉద్యమ కారులను గుర్తించి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ ఆదివారం ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాల వేస్తూ పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర సాధనలో ముందుండి క్రియాశీలక పాత్ర పోషించి నష్టపోయి ఆర్థికంగా కోలుకోలేని స్థితిలో ఉన్న. కేసులపాలై జైలు జీవితం గడిపిన ఉద్యమకారులను గుర్తించాలని అన్నారు. ఈ నెల 20న హైదరాబాదులోని ఇందిరాపార్క్ వద్ద తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సదస్సును జయప్రదం చేయాలని సదస్సుకు అన్ని రాజకీయ పార్టీలలోనే పార్టీలకు అతీతంగా ఉద్యమకారులు తరలి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు ముఖ్యమంత్రి కేసీఆర్ పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడం స్వాగతిస్తున్నామని కానీ ఉద్యమకారులు కూడా వారి ఆత్మగౌరవం కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి.సురేందర్ రెడ్డి.. శ్రీనివాస్ గౌడ్ నరేందర్ యాదిరెడ్డి. రాంబాబు వీరస్వామి తదితరులు పాల్గొన్నారు



## బలిదానాల తెలంగాణను బర్బాద్ చేసిండ్రు

- **రాష్ట్రంలో అవినీతి రాజ్యమేలుతుంది.**
- **టీపీసీసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి వీర్లపల్లి శంకర్.**

**షాద్ నగర్ విశాలభారతి:** అమరుల బలిదానాలు, త్యాగాలతో సాధించుకున్న తెలంగాణను మొత్తం బర్బాద్ చేశారని, కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో అవినీతి రాజ్యమేలుతుందని టీపీసీసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి వీర్లపల్లి శంకర్ విమర్శించారు.ఆదివారం షాద్ నగర్ పట్టణంలోని ఈశ్వర్ కాలనీ, అయ్యప్ప కాలనీలో స్థానిక పట్టణ అధ్యక్షుడు కె.చెన్నయ్య ఆధ్వర్యంలో ఆయన ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఆయా కాలనీల్లో ప్రజలను కలుసుకొని వారి సమస్యలను విన్నాడు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షాద్ నగర్ మున్సిపాలిటీలో అక్రమ వసూళ్ల దందా యదేచ్ఛగా కొనసాగుతోందని ఇల్లు కట్టుకుంటే పైసలు సమర్పించాల్సిందేనని అన్నారు.9ఏళ్ళలో లేనిది ఇప్పుడు అభివృద్ధి పనుల పేరిట అధికార బిఆర్ఎస్ హడావిడి చేస్తుందని, వారికి ఎన్నికలప్పుడే ప్రజలు గుర్తొస్తున్నారన్నారు.ప్రజలు ప్రభుత్వంపై విసుకుచెంది ఉన్నారని, బిఆర్ఎస్ పార్టీని ఇంటికి పంపించడం ఖాయమన్నారు.

ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీని విలీనం. ఏడవ వార్డులో ఆర్టీసీ కాలనీ పర్యటన సందర్భంగా ఆర్టీసీ కార్మికుల కుటుంబాలను ఆయన కలిశారు. ఆర్టీసీ విలీనంపై వారు తమ అభిప్రాయాలను తమతో పంచుకున్నారని, వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశారని ఇందులో నిజం లేదని అన్నారు. ఎన్నికలకు ముందు మోసం చేయడానికి హామీలు ఇస్తున్నారని, తొమ్మిదేళ్లు పాలించి ఏం చేశారని ఎన్నికలు సమీపించిన తరుణంలో ఇప్పుడు ఆదరాబాదరాగా ప్రకటన చేయడం ఎందుకని ప్రశ్నించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాబర్ ఖాన్, ఐఎన్టీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రఘు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందెమోహన్, పురుషోత్తంరెడ్డి, సుదర్శన్, కొప్పాపురం ప్రవీణ్, అరుణ వెంకటరెడ్డి, శీను నాయక్, నాగమణి, నల్లమోని శ్రీధర్, ముబారక్, ఖదీర్, గణేష్ రాథోడ్, రాయికల్ శ్రీనివాస్, మాధవులు, లింగారెడ్డి గూడా అశోక్, దేవగిరి నవీన్ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





## శాలిగౌరారంలో జయశంకర్ జయంతి వేడుకలు

**శాలిగౌరారం,విశాల భారతి:** తెలంగాణ పితామహుడు ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు శాలిగౌరారంలో ఘనంగా నిర్వహించారు.. శాలిగౌరారం పోలీస్ స్టేషన్ లో ఎస్. ఐ ఉప్పల సతీష్ జయశంకర్ చిత్రపటానికి పూల వేసి నివాళులు అర్పించారు..ఈ కార్యక్రమం లో లయన్స్ క్లబ్ చార్టర్ ప్రసిడెంట్ బుడిగె శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్ సయ్యద్ నసీరుద్దీన్ కానిస్టేబుళ్లు లింగయ్య,సతీష్, నాయకులు సిరుపంగి రాములు,గణేష్ తదితరులు పాల్గొన్నారు.



## బీజేపీ,కాంగ్రెస్ లకు ప్రతిపక్ష హోదా పర్మినెంటు

- **లక్ష్మిదేవిపల్లి ప్రాజెక్టుపై బిజెపి నాయకుల డ్రామాలు.**
- **దమ్ముంటే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయహోదా తీసుకురండి.**
- **తెలంగాణా రాష్ట్ర సహకార కార్పొరేషన్ చైర్మన్ రాజా వరప్రసాద్.**

**షాద్ నగర్ విశాలభారతి:**తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ లకు ప్రతిపక్ష హోదా పర్మినెంటు అని, అధికారం శాశ్వతంగా దక్కదనే ప్రస్టేషన్ లో ఆ పార్టీల నాయకులు ముఖ్యమంత్రి కేసీఆర్, స్థానిక ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ లపై అవాకులు చెవాకులు పేలుతున్నారని తెలంగాణా రాష్ట్ర సహకార కార్పొరేషన్ చైర్మన్ రాజా వరప్రసాద్ అన్నారు. షాద్ నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టుపై బిజెపి నాయకులు డ్రామాలాడుతున్నారని, దమ్ముంటే కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ద్వారా పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయహోదా తీసుకురావాలని సవాల్ విసిరారు. ఉదండాపూర్ ప్రాజెక్టు పనులు కొనసాగుతున్నాయని, లక్ష్మీదేవి పల్లి ప్రాజెక్టు కూడా ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. అన్నం పెట్టే అన్నదాత వ్యవసాయ పొలంలో మోటార్లకు మీటర్లు పెట్టాలన్నది మీరు కాదా? తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అందుకు ఒప్పుకోకపోవడం నిజం కాదా? అని ఆయన ప్రశ్నించారు. హిందుత్వం అని చెప్పుకునే బిజెపి నాయకులు షాద్ నగర్ లో సత్యనారాయణ స్వామి వ్రతం చేసి పదిమందికి అన్నం పెట్టిన దాఖలాలు లేవన్నారు.లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ నిర్మాణం కచ్చితంగా ఉంటుందని, దీనికోసం అసెంబ్లీలో చర్చ కూడా జరిగిందని వాటి విధివిధానాలు కూడా రూపొందించారని కొంత డిజైన్ మార్పులు తదితర అంశాలపై తదుపరి నిర్ణయం తీసుకున్నాక రిజర్వాయర్ పనులు ప్రారంభం అవుతాయని అన్నారు.అనవసరంగా స్థానిక ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, ముఖ్యమంత్రి కేసీఆర్ పై నోటికొచ్చినట్టు మాట్లాడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఎంపీపీ ఖాజా ఆహ్మద్ ఇద్రీస్, మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ నటరాజన్, బిఆర్ఎస్ సీనియర్ నాయకురాలు రాజ్యలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్, కృష్ణవేణి, జూపల్లి శంకర్, నరసింహా, గుండు అశోక్ తదితరులు పాల్గొన్నారు.



## దోమలు వ్యాప్తి చెందకుండా ఆయిల్ బాల్స్

**బొల్లారం మున్సిపాలిటీ, విశాల భారతి:** బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని బొల్లారం చైర్ పర్సన్ రోజా బాల్ రెడ్డి మరియు కమీషనర్ సంగారెడ్డి ల సూచనల మేరక ఆదివారపు నాడు పలుకుంటలలో నీరు నిల్వ ఉన్న ప్రదేశాలలో దోమల లార్వా ఉత్పత్తి చెందకుండా ఆయిల్ బాల్స్ ను సిబ్బందితో శానిటరీ ఇన్స్పెక్టర్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో చల్లారు. 19వ వార్డుల్లో ప్రభుత్వ సూచనల మేరకు పది గంటల పది నిమిషాల కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికి తిరుగుతూ దోమల లార్వా ఉత్పత్తిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జవాన్లు రమేష్, బస్తీ వాసులు మురళి, శారద, సంతోష్ రెడ్డి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా ఉద్యమాల్లో ముగిసిన మరో శకం

- **అస్తమించిన తెలంగాణ ఆటగాడు ,పాటగాడు**
- **ప్రజా గాయకుడు గద్దర్ అకాల మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు**

**సూర్యాపేటవిశాలభారతి:** ప్రజా యుద్ధనౌక గాయకుడు,ప్రజా ఉద్యమకారులు గద్దర్ అకాల మరణం ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి, సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మాదివెంకటేశ్వర్లు, కోలిశెట్టి యాదగిరిరావు, బుర్రి శ్రీరాములు, శేఖర్ రావు, రవి నాయక్, మట్టిపెల్లి సైదులు,పాండు, వెంకటేశ్వరరావు, గోపి, ఏకలక్ష్మి ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తన జీవితాంతం పాటే ప్రాణంగా నమ్మి తన ఆట పాట ద్వారా ప్రజలను కదిలించి అనేక ప్రజా ఉద్యమాలను నిర్మించారని గుర్తు చేశారు. నాటి నక్సల్బరీ పోరాటం నుండి ప్రత్యేక తెలంగాణ సాధన వరకు ఆయన నిర్మించిన అనేక పోరాటాలు మరువలేని అన్నారు. 75 సంవత్సరాల వయసులోనూ పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఆట పాటల ద్వారా ప్రజలను చైతన్యం చేశారని అన్నారు. ఆయన మరణం కమ్యూనిస్టు ఉద్యమాలకు, వామపక్ష ఉద్యమాలకు,సామాజిక పోరాటాలకు తీరని లోటు అన్నారు.

గద్దర్ మరణించినప్పటికీఆయన రాసిన పాటలు ప్రజల గుండెల్లో ఎల్లప్పుడూ నిలిచి ఉంటాయన్నారు. తన పాట ద్వారా అనేక ప్రభుత్వాలను ప్రశ్నించిన చరిత్ర గద్దర్ కు దక్కిందన్నారు. గద్దర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ వారికి జోహార్లు అర్పిస్తున్నామన్నారు.



## స్నేహితునికి ఆర్థిక సహాయం చేసిన సంజయ్ దాస్

**చిట్యాల,విశాలభారతి:** స్నేహితుల దినోత్సవం రోజున తనతో 10వ తరగతి చదువుకున్న స్నేహితుడు కర్రె లింగస్వామి అనారోగ్యం తో బాధపడుతున్న విషయం తెలుసుకున్న తెలంగాణ ఉద్యమ కారుడు,బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నేత కూనూరు సంజయ్ దాస్ గౌడ్ తన స్నేహితుని ఇంటికి వెళ్ళి ఆరోగ్య పరిస్థితి తెలుకొని, కుటుంబ సభ్యులతో మాట్లాడి అధైర్య పడొద్దని ధైర్యం చెప్పి 25 వేల రూ.ల ఆర్థిక సహాయం అందజేశారు. ఆరోగ్య పరిస్థితి ని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం ద్వారా వైద్యానికి అవసరమైన ఆర్థిక సాయం ఎల్వోసి ద్వారా అందిస్తానని కుటుంబ సభ్యుల కు హామీ ఇచ్చి ధైర్యం చెప్పారు. ఆయన వెంట స్నేహితులు సూరేపల్లి సూర్యనారాయణ, పిట్ల దుర్గయ్య తదితరులు ఉన్నారు.



## కోరిన కోరికలు నెరవేరిచే కొంగుబంగారం బంగారు మైసమ్మ తల్లి

**కుటుంబసమేతంగా అమ్మవారిని దర్శించుకున్న టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్**

**బోడుప్పల్,విశాలభారతి:** కోరిన కోరికలు నెరవేరుస్తూ కొంగుబంగారంగా గ్రామ ప్రజల ఇలవేల్పుగా పూజలు అందుకుంటున్న తల్లి బంగారు మైసమ్మ అని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. శ్రావణమాస బోనాల పండుగను పురస్కరించుకొని బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బంగారు మైసమ్మ, నల్ల పోచమ్మ, అశోక్ నగర్ లోని అమ్మవారి దేవాలయాలలో టిపిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ బోడుప్పల్ మాజీ సర్పంచ్ తోటకూర లక్ష్మి వజ్రేష్ యాదవ్ దంపతులు కుటుంబ సమేతంగా అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ పూజా కార్యక్రమంలో కార్పొరేటర్ తోటకూర అజయ్ యాదవ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.




# జయశంకర్ సార్ జీవితం ఆదర్శప్రాయం..

**అడ్మిన్ డిసిపి ఇందిర**

హైదరాబాద్విశాల భారతి: ప్రొఫెసర్ జయశంకర్ గారి 89వ జయంతి సందర్భంగా రాచకొండ పోలీస్ కమిషనరేట్, నేరేడ్‌మెట్‌లో అడ్మిన్ డిసిపి ఇందిర నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ జయశంకర్ సార్ ప్రముఖ తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త అని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడారని అడ్మిన్ డిసిపి ఇందిర పేర్కొన్నారు. తన జీవితమంతా తెలంగాణ ఉద్యమానికే అంకితం చేశారని ఆమె గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు జయశంకర్ సార్‌ను ఎప్పటికీ గుర్తుంచుకుంటారని, తెలంగాణ చరిత్రలో ఆయన సేవలు చిరస్థాయిగా నిలిచి పోతాయని డిసిపి ఇందిర అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో రాచకొండ అదనపు డీసీపీ అడ్మిన్ శ్రీనివాస రెడ్డి, అర్ఐ ప్రమోద్ కుమార్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# అంబేద్కర్ కమిటీ హాల్ నాణ్యత లోపం లేకుండా నిర్మించాలి

**చేగొండి శ్రీనివాసరావు మాజీ ఎంపీటీసీ**

**భద్రాచలం,విశాలభారతి:** భద్రాచలం పట్టణంలోని భగవాన్ దాస్ కాలనీలో నిర్మాణం చేస్తున్న ఎస్సీ కమిటీ హాల్ నాణ్యత ప్రమాణాలు పాటించిన నిర్మించాలని చేగొండి శ్రీనివాసరావు (మాజీ ఎంపీటీసీ) డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జరుగుతున్న ఎస్సీ కమిటి హాల్ నిర్మాణ పనులను పరిశీలించారు.ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే సున్నం రాజయ్య 40 లక్షలునిధులతో మంజూరైన ఎస్సీ కమిటీ హాల్ నిర్మాణం పనులు నత్తనడక నడుస్తుందని ఆయన అన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆయన కోరారు. రెండు సంవత్సరాలు కావస్తున్న ఇంత మట్టికి పూర్తి కాలేదని పనులను జాప్యం చేయకుండా అంబేద్కర్ కమిటీ హాల్ను పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలో దళిత నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**కాంట్రాక్టర్ తిరుపతిరావు**

అంబేద్కర్ కమిటీ హాల్ నిధుల మేరకు కడుతున్నామని కొంతమంది కావాలని జరుగుతున్న పనులను అడ్డుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారని. ప్రతి ఒక్కరు వచ్చి ఫోటోలు దిగి పేపర్ స్టేట్మెంట్ ఇవ్వటం సరైనది కాదని ఏదన్న ఉంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి తప్ప ప్రతిష్టకు దెబ్బతీసే విధంగా స్టేట్మెంట్లు ఇవ్వద్దని ఆయన తెలిపారు. నాణ్యత ప్రమాణాలు లేకుంటే సంబంధిత అధికారులు ఉన్నారని వాళ్లు మా దృష్టికి తీసుకొస్తారని ఇలా రాద్ధాంతం చేసి డబ్బులు ఆశించేందుకు ఇలా చేస్తున్నారని ఆయన వివరణ ఇచ్చారు.




# రుణమాఫీ హామీ ప్రకారం వడ్డీతో సహా ప్రభుత్వమే చెల్లించాలి

**సిపిఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు**

**గరిడేపల్లి,విశాలభారతి:** 2018 శాసనసభ ఎన్నికలలో తెరాస పార్టీ మేనిపెస్టో లో పేర్కొన్న విదంగా లక్ష రూపాయల లోపు రుణమాఫీ హామీ వడ్డీ తో సహా ప్రభుత్వమే చెల్లించి రైతులకు రుణ విముక్తి చేయాలని సిపిఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు అన్నారు. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల కేంద్రంలో జరిగిన సిపిఐ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 5 ఐదు సంవత్సరాలు అవుతున్నా నేటివరకు రుణమాఫీ అమలు చేయకుండా, మళ్ళీ ఎన్నికలు వస్తున్నాయానే హడావిడి లో ప్రకటనలు చేసి చేతులు దులుపుకోవడం సరికాదని అన్నారు .వడ్డీ తో సహా ప్రభుత్వ నిధులను బ్యాంకులకు ఇచ్చి రైతులను ఋణ విముక్తులను చేయాలని అన్నారు. తెరాస ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన వెంటనే నెరవేర్చుతారనే నమ్మకంతో ఎన్నికల్లో అఖండ మెజారిటీతో గెలిపిస్తే 5 ఐదు సంవత్సరాలు పూర్తికావస్తున్నా నెరవేర్చలేదని, నేటికీ కూడా పూర్తి స్థాయిలో రుణమాఫీకి నిధులు కేటాయించలేదని అన్నారు. ప్రభుత్వం మాఫీ చేస్తుందనే నమ్మకం తో చాలా మంది రైతులు బ్యాంకుల వద్ద తీసుకున్న రుణాలను చెల్లించలేదని, వడ్డీలకు వడ్డీలు కట్టిన బ్యాంకులు చాలా మంది రైతులను మొండి బకాయిదారుల జాబితాలో చేర్చి రుణాలను ఇవ్వటం లేదని అన్నారు. ఈ అవమానాలతో చాలా మంది రైతులు ఆత్మహత్యలు కూడా చేసుకున్నారని, అయినా ప్రభుత్వం ప్రభుత్వ పెద్దలు చలించకుండా, మళ్ళీ ఎన్నికల్లో రైతుల ఓట్లకోసం రుణమాఫీ ప్రకటనలు చేస్తున్నారని అన్నారు. రుణ మాఫీ కి పూర్తి స్థాయిలో నిధులను బ్యాంకులకు కేటాయించి, వడ్డీతో సహా రుణమాఫీ చేస్తేనే రైతులు ప్రభుత్వ పెద్దలను నమ్ముతారు తప్ప ప్రకటనలను నమ్మరని ఆయన అన్నారు.రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మాయమాటలతో మోసం చేస్తే భవిష్యత్తు లో భారీ మూల్యం చెల్లించుకోవాల్సివస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు త్రిపురం సుధాకర్ రెడ్డి, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు కడియాల అప్పయ్య,యడ్ల అంజిరెడ్డి,రైతు సంఘము నాయకులు, మెండే వెంకటేశ్వర్లు, జొన్నలగడ్డ తిరపయ్య, వేశాల ఆంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి తాళ్ల తిరపయ్య తదితరులు పాల్గొన్నారు.

# స్వరాష్ట్ర సాధనలో జయశంకర్ కృషి మరువలేనిది

**- యస్.పి అపూర్వ రావు**





**నల్లగొండ,విశాలభారతి:** స్వరాష్ట్ర సాధనలో జయశంకర్ కృషి మరువలేనిదని జిల్లా యస్.పి కె.అపూర్వ రావు ఐపిఎస్ అన్నారు. నల్లగొండ జిల్లా పోలీసు కార్యాలయంలోప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న యస్.పి అపూర్వ రావు ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కోసం అనునిత్యం పరితపించి, మన ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాన్ని ఎలుగెత్తి చాటి,మలి దశ ఉద్యమానికి సిద్ధాంతకర్తగా నిలిచిన రాష్ట్ర ఏర్పాటే లక్ష్యంగా, స్వరాష్ట్ర సాధన కోసం తన చివరి శ్వాస వరకు పోరాడారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనకోసం జయశంకర్ తెలంగాణ ఉద్యమానికే తన జీవితాన్ని అంకితం చేసి ఆజన్మ బ్రహ్మచారిగా జీవించారని 1969 తెలంగాణ ఉద్యమంలో నూ, అంతకు ముందు నాన్ ముల్కీ ఉద్యమంలో, సాంబార్ ఇడ్లీ గోబ్యాక్ ఉద్యమంలో పాల్గొన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతపై పలు పుస్తకాలు రచించారన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కళ్ళారా చూడకముందే 2011 జూన్ 21న మరణించడం బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో యస్.బి డిఎస్పీ సోమ్ నారాయణ్ సింగ్, నల్లగొండ డిఎస్పీ శ్రీదర్ రెడ్డి,సిఐలు 2 టౌన్ సి.ఐ పి.యన్.డి ప్రసాద్, 1 టౌన్ సిఐ సత్యనారాయణ, ఉమెన్ పోలీస్ స్టేషన్ సిఐ కొండల్ రెడ్డి,ఆది రెడ్డి, శ్రీను,ఆర్.ఐ హరిబాబు,యస్. ఐ లు మరియు సిబ్బంది పాల్గొన్నారు.



# బుచ్చిరెడ్డి కి నివాళులర్పించిన ఎమ్మెల్యే చిరుమర్తి

**చిట్యాల,విశాలభారతి:** చిట్యాల మండలం ఏపూర్ గ్రామానికి చెందిన ఎంపల్ల బుచ్చిరెడ్డి శనివారం రోజు ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తో మృతి చెందడం జరిగింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య బుచ్చిరెడ్డి పార్థివ దేహానికి పులమాలలు వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి 50వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేసారు. ఎమ్మెల్యే వెంట గ్రామ సర్పంచ్ పాలెం మాధవి మల్లేష్, వెల్లంకి ఎంపీటీసీ తిమ్మాపురం మహేందర్ రెడ్డి, పెరేపల్లి మాజీ సర్పంచ్ కొలను సతీష్ గౌడ్ తదితరులు ఉన్నారు.




# పోలీస్ స్టేషన్ ను సందర్శించిన డిప్యూటీ కమీషనర్

**బాల్కొండ,విశాలభారతి:** బాల్కొండ నియోజకవర్గంలోని మెండోరా పోలిస్ స్టేషన్ ను ఆదివారం నిజామాబాద్ జిల్లా నూతన డిప్యూటీ కమీషనర్ జయరాం సందర్శించారు. ఇందులో భాగంగా ఎస్సై శ్రీనివాస్ యాదవ్ సిబ్బంది కలిసి ఆయనకు స్వాగతం పలికారు.ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం పరిసరాలను, రికార్డులను పరిశీలించారు.హైవే పైన గ్రామాల్లో రాత్రి సమయంలో పెట్రోలింగ్, బీట్లు పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పోచంపాడ్ ప్రాజెక్ట్ ని సందర్శించి గేట్లు ఎత్తినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు.అలాగే పర్యాటకులు ప్రాజెక్టు వద్ద,గోదావరి నదిలోకి వెళ్ళి ప్రమాదాలను కొని తెచుకోవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాస్ యాదవ్,సిబ్బంది పాల్గొన్నారు.



# సరస్వతి శిశు మందిర్ లో నోట పుస్తకాలు పంపిణీ

- **దాత నక్క ప్రసాద్**

భద్రాచలం,విశాలభారతి: సరస్వతి శిశుమందిర్లో శ్రీకృష్ణదేవరాయ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద విద్యార్థుల చదువు నిమిత్తం ట్రస్ట్ సభ్యులు నక్కా ప్రసాద్ తల్లిదండ్రులు కీ, శే, నక్క రామారావు నరసింహారత్నం జ్ఞాపకార్థం గా సుమారు రూ 30000/ లో విలువ గల నోట్ పుస్తకాల పంపిణీ చేసిన శ్రీ కృష్ణదేవరాయ ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ పిన్నింటి రాజశేఖర్ నక్క ప్రసాద్ సోమరౌతు శ్రీనివాస్ తాళ్లపూడి రాము ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ఈ శిశు మందిర్ స్కూల్ ద్వారా సభ్య సమాజంలో సభ్యత నేర్చుకొని చదువు ద్వారా ఉన్నత విలువలను ఉన్నత స్థాయికి ఎదగాలని ఈ సరస్వతి శిశు మందిర్ కి మరింత మంది దాతలు ముందుకు వచ్చి ఈ పిల్లలు ఉన్నత చదువులకు సాయం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు సంఘ సేవకులు స్కూల్ నిర్వాహకులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అనంతరం స్నేహితుల దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్స్, ఫ్రూట్స్ మరియు మిఠాయి పంచడం జరిగింది.




# రైతు రుణమాఫీకి నిధులు విడుదల పట్ల హర్షం వ్యక్తం

**కోదాడ,విశాలభారతి:** ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో తెలంగాణలో వ్యవసాయం పండగల మారిందని కోదాడ పిఎసిఎస్ చైర్మన్ ఆవుల రామారావు అన్నారు. ఆదివారం కోదాడ మండల పరిధిలోని గణపవరం గ్రామంలో ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతుల రుణమాఫీకి 19 వేల కోట్లు నిధులు విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం పిఎసిఎస్ డైరెక్టర్లు, రైతులతో కలిసి ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఇన్ని వేల కోట్ల రూపాయలు రైతుల సంక్షేమానికి ఖర్చు చేయలేదన్నారు. నాణ్యమైన ఉచిత విద్యుత్, రైతుబంధు, రుణమాఫీ, ఇరిగేషన్ ప్రాజెక్టులు, విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించి రైతులు పండించిన పంటను ప్రభుత్వం మద్దతు ధర కి కొనుగోలు చేసి రైతుల పక్షపాతిగా ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ బుడిగం నరేష్, మాజీ ఎంపీపీ పిడమర్తి రమేష్ బాబు,పొట్ట విజయ కిరణ్, జాబిశెట్టి చంద్రమౌళి, డైరెక్టర్లు గుండపునేని ప్రభాకర్ రావు, వట్టే సీతారామయ్య, బొర్ర చంద్రమౌళి, పొట్ట జగన్మోహన్ రావు, అప్పిరెడ్డి, జంగం రామారావు, బసవయ్య, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్

- **ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలను ప్రతి ఒక్కరు పాటించాలి**
- **జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎ.వెంకట్ రెడ్డి**

**సూర్యాపేట,విశాలభారతి:** ఆదివారం కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్ నందు ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి జిల్లా అదనపు కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రొఫెసర్ జయ శంకర్ 89వ జయంతి వేడుకలు పురస్కరించుకొని వారి యొక్క సేవలను కొనియాడారు. తెలంగాణా ఆవశ్యకతను ప్రపంచానికి చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి, తెలంగాణా ఉద్యమ సిదంతా కర్త అని ఆయన ఉద్యమ స్పూర్తిని కొనియాడారు. జయశంకర్ కలలుగన్న తెలంగాణ మనకు సిద్ధించిందని ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరు తూచ తప్పకుండా పాటించాలని అన్నారు. ఈ సమావేశం లో డి ఆర్ డి ఓ పి డి కిరణ్ కుమార్, సి పి ఓ వెంకటేశ్వర్లు, అగ్రికల్చర్ ఆఫీసర్ రామారావు నాయక్, డిపిఓ యాదయ్య, డిటిడిఓ శంకర్, దయానంద రాణి, శ్యామ్, శ్రీనివాస్ ,అశోక్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు




**మునగాల,విశాలభారతి:** ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా టిఆర్ఎస్వి మునగాల మండల అధ్యక్షుడు బెల్లంకొండ ఉపేందర్ ఆధ్వర్యంలో అనాధ వృద్ధాశ్రమంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వృద్ధాశ్రమంలోని అనాధ వృద్ధులకి పండ్లు బ్రెడ్ ప్యాకెట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిఆర్ఎస్వి కోదాడ నియోజకవర్గ అధ్యక్షుడు పాషా పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ సిద్ధాంతకర్తగా, ఉద్యమ స్ఫూర్తి ప్రధాతగా తెలంగాణ ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయిన వ్యక్తి ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ అని పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ చేసిన నిరంతర కృషిని, ఆయన ధృడ సంకల్పాన్ని తెలంగాణ రాష్ట్రం ఎప్పటికీ మరచిపోదన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్వి కోదాడ పట్టణ అధ్యక్షులు బొర్రా వంశీ, నాని, విద్యార్థి నాయకులు క్రాంతి కుమార్, తరుణ్ రెడ్డి, మహిముద్, నరేష్, అఖిల్, ఆసిఫ్, రియాజ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

# అధ్యాపకుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందచేత

- **ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన తెలుగు లెక్చరర్ సలీమ్ కు రూ.65 వేలు ఆర్థిక సహాయం**
- **ఆదర్శంగా నిలిచిన సూర్యాపేట ప్రైవేట్ లెక్చరర్లు**



**సూర్యాపేట,విశాలభారతి:** అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన తోటి లెక్చరర్ కుటుంబానికి జిల్లా కేంద్రంలోని వివిధ ప్రైవేట్ జూనియర్, డిగ్రీ కళాశాలల లెక్చరర్లు ఆర్థిక సహాయాన్ని అందించి అండగా నిలిచి స్నేహ బంధాన్ని చాటుకున్నారు.జిల్లా కేంద్రంలోని వివిధ కళాశాలల్లో తెలుగు లెక్చరర్ గా సేవలందించిన ఎస్ కె.సలీమ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. జిల్లా కేంద్రంలోని వివిధ ప్రైవేట్ కళాశాలల మేనేజ్మెంట్, లెక్చరర్లు సలీమ్ కుటుంబానికి మేమున్నామంటూ అండగా నిలిచారు. తమ వంతుగా ఆర్థిక సహాయాన్ని అందించారు. అందరి ఆర్థిక సహాయంతో సేకరించిన రూ.65 వేలను ఆదివారం సలీమ్ నివాసంలో ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు. ఫ్రెండ్‌షిప్ డే సాక్షిగా మేమున్నామంటూ ముందుకు వచ్చి సూర్యాపేట ప్రైవేట్ లెక్చరర్లు ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా తండ రమేష్ మాట్లాడుతూ సూర్యాపేట పట్టణంలోని వివిధ కళాశాలల మేనేజ్మెంట్, లెక్చరర్లు అందించిన సహకారం మరువలేనిది అన్నారు. ఆపద సమయంలో తమ తోటి అధ్యాపకుడి కుటుంబానికి అండగా నిలిచిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.భవిష్యత్తులో కూడా తమ మిత్రుని కుటుంబానికి అండగా ఉంటామన్నారు.ఈ కార్యక్రమంలో గంజికుంట్ల గోపీనాథ్, గుండాల శ్రీనివాస్,నాగేశ్వర రావు, నుకపంగు లింగయ్య , కందుల విజయకర్ తదితరులు పాల్గొన్నారు.





# సీఆర్ ఆర్యవైశ్యులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి


- హక్కుల కోసం ఆర్యవైశ్యులు ఐక్యంగా ఉద్యమించాలి
- ఆవోపా రాష్ట్ర అధ్యక్షులు మలిపెద్ది శంకర్

**కోదాడ,విశాలభారతి:** ఆర్యవైశ్యులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఐదువేల కోట్ల రూపాయల నిధులను మంజూరు చేయాలని అవొపా రాష్ట్ర అధ్యక్షులు మలిపెద్ది శంకర్, రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం నాయకులు, జడ్పిటిసి ఉప్పల వెంకటేష్ లు అన్నారు. ఆదివారం కోదాడ పట్టణంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ సాధన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర జనాభాలో 13% ఉన్న ఆర్యవైశ్యులకు చట్టసభల్లో ప్రాతినిధ్యం లేదన్నారు. ఆర్యవైశ్యుల్లో అనేకమంది పేదవాళ్లు ఉన్నారని వారిని ఆర్థికంగా, సామాజికంగా, బలోపేతం చేసేందుకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఆర్యవైశ్యులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. హక్కుల సాధన కోసం ఆర్యవైశ్యులంతా ఐక్యంగా ఉద్యమించాలన్నారు. కాగా ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుకు ఆర్యవైశ్య అఫీషియల్స్ ప్రొఫెషనల్ అసోసియేషన్ కోదాడ అధ్యక్షులు ఇమ్మడి రమేష్ ఆధ్వర్యంలో పట్టణంలోని నాగు బండి రామ్మూర్తి నగర్ నుండి వందలాదిమంది ఆర్యవైశ్యులు భారీ ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక గునుగుంట్ల అప్పయ్య ఫంక్షన్ హాల్ లో ఏర్పాటుచేసిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. తమ హక్కుల సాధనకు కార్యాచరణను రూపొందించి దశల వారిగా ఉద్యమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర అవొపా ఫైనాన్షియల్ సెక్రటరీ కందికొండ శ్రీనివాస్, కోదాడ అవొపా అధ్యక్షులు ఇమ్మడి రమేష్, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పైడిమర్రి నారాయణరావు, వైశ్య సంఘం నాయకులు ఇరుకుల్లా చెన్నకేశవ రావు, వంగవీటి రామారావు, ఓరుగంటి ప్రభాకర్, వెంపటి మధుసూదన్, రాయపూడి వెంకట నారాయణ, ఓరుగంటి కిట్టు, పలువురు ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.



# గద్దర్ కు నివాళి

Bస్థానిక బాపూజీ గ్రంథాలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రజా యుద్ధనౌక, ప్రజా గాయకులు, రచయిత గద్దర్ సంతాప సభను జరుపుకోవడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ రచయిత జూలూరి గౌరీ శంకర్ పాల్గొని గద్దర్ చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించి మౌనం పాటించడం జరిగింది. తదనంతరం జూలూరు గౌరీ శంకర్ మాట్లాడుతూ తన మాట, పాట రచనలతో సమాజంలో చైతన్యం తీసుకువచ్చి ప్రతి ఒక్కరికి ప్రశ్నించే తత్వం అలవాటు చేశారని, ఆయన పాటలు కాలక్షేపం కోసం కాకుండా తెలంగాణ రాష్ట్ర సాధనలో తెలంగాణ ఉద్యమంలో కీలక భూమికను పోషించాయి అని ఆయన అన్నారు. అలాగే ఆయన రాసిన పాటలు ప్రతి ఒక్కరి నాలుకలపై ఎప్పటికీ సజీవమే అని, ఆయన లేక పోయినప్పటికీ ఆయన సాహిత్యం సమాజంలో సజీవంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో తెర సాంస్కృతిక కళామండలి వ్యవస్థాపక అధ్యక్షులు వేముల వెంకటేశ్వర్లు, పాలూరి సత్యనారాయణ ,డాక్టర్ అనంతారపు బ్రహ్మం,సట్టు నాగేశ్వరరావు, గ్రంథాలయ చైర్మన్ రహీం, ఎస్ కే మీరా, ఎస్ .కే .పీర్ సాహెబ్,రేపాకుల గురవయ్య, సన్నీరు మురళి, ద్రమ్ము శీను, మేకపోతుల వెంకటేశ్వర్లు , పుప్పాల కృష్ణమూర్తి, వెంకట్ , సంగిశెట్టి గోపాల్, కృష్ణయ్య, వార్డెన్ రాధాకృష్ణ, బొల్లు రాంబాబు, బడుగుల సైదులు, ఏ.ఎన్ స్వామి మొదలగువారు పాల్గొన్నారు.



# ఘనంగా ముదిరాజ్ ఆత్మీయ సమ్మేళనం

**విశాలభారతి,ధర్పల్లి:** ధర్పల్లి మండల కేంద్రంలో ఆదివారం ముదిరాజ్ మండల కమిటీ ఆత్మీయ సమ్మేళనం పాత గురడి కాపు సంఘంలో ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ధర్పల్లి ముదిరాజ్ మండల అధ్యక్షులు మచ్చ రఘురామ్ మాట్లాడుతూ... మండల వ్యాప్తంగా ముదిరాజ్ కులస్తులు ఆర్థికంగా ఉన్నప్పటికీ రాజకీయ వెనుకబడి ఉన్నామని రానున్న రోజుల్లో రాజకీయంగా ఎదిగి మంచి పదవుల్లో ఉండాలని ఆదివారం ముదిరాజ్ ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు లోక్కిడి సంతోష్,సితాయిపేట్ సర్పంచ్ లోక్కిడి విజయ రాములు, జనరల్ సెక్రెటరీ నాయుడి సుభాష్, ఉపాధ్యక్షులు కర్రోళ్ల శ్రీనివాస్, కుంట రవి, కోశాధికారి లింగాపురం శ్రీనివాస్, అధికార ప్రతినిధి చేగంటి భూమయ్య, సంయుక్త కార్యదర్శి కర్ణాల గంగా నర్సయ్య, కార్యదర్శులు బంగ్లా ప్రభు, అక్లూరి శ్రీనివాస్, లోక్కిడి సురేష్, కార్యవర్గ సభ్యులు భాష బోయిన నరేందర్, ముదిరాజ్ నాయకులు కర్రోల్ల శ్రీకాంత్ ,నారాయణ, బాల నర్సయ్య, సొసైటీ డైరెక్టర్ గంగా నర్సయ్య, కనకం రాజేందర్,సుంచ నరేష్, నర్సయ్య,మచ్చ సుధాకర్,ఈదుల రమేష్, తదితరుల పాల్గొన్నారు.



# మోడల్ కనెక్టివిటీ తో జిల్లా రైల్వే స్టేషన్

- ప్రపంచ స్థాయి వసతులతో రూపుదిద్దుకోబోతున్న కొత్తగూడెం రైల్వే స్టేషన్

భద్రాద్రికొత్తగూడెం,విశాలభారతి: అమృత్ భారత్ రైల్వే స్టేషన్లో భాగంగా ఆగస్టు 6న ఆదివారంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మోడల్ కనెక్టివిటీ అనుసంధానంతో భద్రాచలం రోడ్డు రైల్వే స్టేషన్ ను డిఎస్పి కోనేరు చిన్ని ఘనంగా లాంచ్ చేశారు. దేశవ్యాప్తంగా 508 రైల్వే స్టేషన్లను పునరుద్ధరించనున్నారు. అందులో మన తెలంగాణ రాష్ట్రంలో 21 స్టేషన్లను పునరాభివృద్ధి చేయనున్నారు. మన కేంద్ర ప్రభుత్వం 25 వేల కోట్లతో 508 రైల్వే స్టేషన్లను ప్రపంచ స్థాయి వసతులతో సంతరించుకోనున్నాయి.అందులో మన తెలంగాణ రాష్ట్రంలో 21 స్టేషన్లు 914 కోట్ల వ్యయం తో ఆధునికరణకు సిద్ధంగా ఉన్నాయి. ప్రతి స్టేషన్లలో నగర అభివృద్ధి, స్టేషన్ భవనాల అభివృద్ధి, రూమ్ ప్లాజా, షాపింగ్ రూల్, ఫుడ్ కోర్ట్, పిల్లల ఆట స్థలం, మొదలు సౌకర్యాలు కల్పించనున్నారు. ప్రయాణికుల సౌకర్యాల కోసం వేరువేరుగా ఎగ్జిట్ మరియు ఎంట్రీ మార్గాలు మరియు మల్టీ లెవెల్ వర్కింగ్, లిఫ్ట్ ఎగ్జిక్యూటివ్ లాంచ్, వేచి ఉండు ప్రదేశం, దివ్యాంగుల కోసం ప్రత్యేక సదుపాయం కల్పించనున్నా



రు. ఆగస్టు 6న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎ.వి లో చేశారు. తెలంగాణ రాష్ట్రంలో పునరాభివృద్ధి చెందుతున్న స్టేషన్లు అదిలాబాద్, భద్రాచలం రోడ్డు (కొత్తగూడెం) హఫీజ్పేట్, హైటెక్ సిటీ, ఉప్పుగూడ, హైదరాబాద్ జనగాం కామారెడ్డి కరీంనగర్ కాజిపేట్ జంక్షన్ ఖమ్మం మధిర మహబూబ్నగర్ మహబూబాబాద్ మలక్పేట్ మల్కాజ్గిరి నిజాంబాద్ రామగుండం యాదాద్రి మరియు జహీరాబాద్, మల్టీ మోడల్ కనెక్టివిటీ అనుసంధానంతో పునరాభివృద్ధి చందనన్నాయి.

# గద్దర్ మృతి పై సంతాపం తెలిపిన మాజీ ఎమ్మెల్యే వీరేశం

**చిట్యాల,విశాలభారతి:** ప్రజా గాయకుడు గద్దర్ మృతి పట్ల నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం ఒక ప్రకటనలో విచారం వ్యక్తం చేస్తూ సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తనపాటలతో ప్రజా చైతన్యాని కి యెనలేని కృషి చేసిన "ప్రజా యుద్ధనౌక" గద్దర్ తన గళంతో ప్రజలను కదిలించిన గద్దర్ మృతి తో ప్రజా ఉద్యమాల్లో పౌరహక్కుల పోరాటాల్లో ఒక శకం ముగిసినట్లు అయ్యిందని ఒక ప్రకటనలో వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు





# సోంపల్లి గ్రామంలో పర్యటించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

**బూర్గంపాడు,విశాలభారతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,పినపాక నియోజకవర్గం, బూర్గంపాడు మండలంలోని సోంపల్లి గ్రామంలో మండల అధ్యక్షులు దుగ్గెంపుడి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ టిపిసిసి సభ్యులు డాక్టర్ చందా సంతోష్ కుమార్ పర్యటించారు. గత కొన్ని రోజులుగా అక్కడ విష జ్వరాలతో ఇబ్బంది పడుతున్న ప్రజల పరిస్థితులను తెలుసుకొని వారు పాల్వంచ ఏరియా ఆసుపత్రిలో డెంగ్యూ మరియు విష జ్వరాల బారిన పడి చికిత్స పొందుతున్న విషయం తెలుసుకొని, ఆసుపత్రిని సందర్శించి అక్కడ ఉన్న రోగులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ డెంగ్యూ మరియు విష జ్వరాలతో సుమారు 100 మంది ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు.దమ్మున్న నాయకుడు అని చెప్పు కుంటున్న స్థానిక ఎమ్మెల్యే రేగ కాంతారావు ఇంతమంది ప్రజలు విష జ్వరాలతో ఇబ్బంది పడుతున్న కనీసం పట్టించుకునే పరిస్థితి లేదన్నారు.వెంటనే గ్రామంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి రోగులకు పూర్తిస్థాయి వైద్యం అందించి పర్యవేక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా విష జ్వరాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్న గ్రామాలలో హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి మెరుగైన వైద్యం అందించాలని మరియు ప్రతి ఒక్క కుటుంబానికి దోమతెరలు పంపిణీ చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.అలాగే కాంగ్రెస్ పార్టీ తరపున అన్నివేళలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో డిసిసి మైనార్టీ అధ్యక్షులు మహిమూద్ ఖాన్ , పినపాక నియోజకవర్గం కోఆర్డినేటర్ కాటబోయిన నాగేశ్వరరావు , నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ బీరం సుధాకర్ రెడ్డి నియోజకవర్గ నాయకులు కనితి కృష్ణ , సీనియర్ నాయకులు గాదె కేశవ రెడ్డి బి బ్లాక్ మహిళా నాయకురాలు బర్ల నాగమణి, మండల నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# గద్దర్ మరణం అణగారిన వర్గాలకు తీరనిలోటు


**మేడిపల్లి,విశాలభారతి:** మేడిపల్లి మండలం సిపిఐ పార్టీ మండల కార్యదర్శి రచ్చ కిషన్ కామ్రేడ్ గద్దర్ మృతికి సంతాపం ప్రకటించారు. గద్దర్ అన్న మరణం అణగారిన వర్గాలకు తీరనిలోటని తెలుగు జాతికి ఒక స్ఫూర్తి అని మలిదశ తెలంగాణ ఉద్యమానికి పునాది వేసిన గద్దరని కొనియాడారు. అన్యాయాలను ప్రతినిత్యం ప్రశ్నించేవాడని. ఉద్యమాలకు ఊపిరి తెచ్చిన తన పాటలతో ప్రజలను ఎంతో చైతన్య పరిచేవాడని కొనియాడారు.

# గద్దర్ మృతి విప్లవ ఉద్యమానికి తీరనిలోటు

**నూతనకల్, విశాలభారతి:** ప్రజా యుద్ధ నౌక ప్రజా గాయకుడు గద్దర్ అకాల మృతి కమ్యూనిస్టు విప్లవ ఉద్యమాలకు తీరనిలోటు అని సీపీఐ మండల కార్యదర్శి తొట్ల ప్రభాకర్ అన్నారు .ఆదివారం మండల కేంద్రంలో గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి విప్లవ ఉద్యమాలలో చురుకుగా పాల్గొని అజ్ఞాతవాస జీవితాన్ని గడిపి తుపాకులకు భయపడకుండా అనేక పోరాటాలను నడిపిన గద్దర్ జీవితాన్ని ప్రశ్నించే గొంతుకను నేటి యువత స్ఫూర్తిగా తీసుకొని దేశంలో కులం మతం పేరిట, మహిళలపై జరుగుతున్న హత్యలు అత్యాయత్నాలపై పోరాటం చేయాలని సూచించారు .ఈ కార్యక్రమంలో నాయకులు మద్దెల రామ్మూర్తి ,యానాల వెంకటరెడ్డి ,రవి ,లింగయ్య ,ఈరన్న ,లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు

# గద్దర్ మృతిపట్ల సీపీఐ (యంయల్) లిబరేషన్ సంతాపం

**పాలకుర్తి,విశాలభారతి:** ప్రజా గాయకుడు గద్దర్ మృతి పట్ల సీపీఐ (యంయల్) లిబరేషన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ సంతాపం ప్రకటించింది. గద్దర్ గతంలో విప్లవోద్యమంలో పనిచేశారని,ఆట, పాటలతో యువతను ఉత్తేజపరిచి విప్లవోద్యమం వైపు మళ్ళించారని రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్ రాజా గుర్తు చేశారు.గద్దర్ మృతి హక్కుల ఉద్యమాలకు, సాంస్కృతి కోద్యమానికి తీరని లోటని పేర్కొన్నారు.గద్దర్ మృతి పట్ల సీపీఐ (యంయల్) లిబరేషన్ సంతాపం ప్రకటిస్తూ ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలుపుతుందని రమేష్ రాజా ఒక ప్రకటనలో తెలిపారు.



# గద్దర్ మరణం అణగారిన వర్గాలకు తీరనిలోటు

**మేడిపల్లి,విశాలభారతి:** మేడిపల్లి మండలం సిపిఐ పార్టీ మండల కార్యదర్శి రచ్చ కిషన్ కామ్రేడ్ గద్దర్ మృతికి సంతాపం ప్రకటించారు. గద్దర్ అన్న మరణం అణగారిన వర్గాలకు తీరనిలోటని తెలుగు జాతికి ఒక స్ఫూర్తి అని మలిదశ తెలంగాణ ఉద్యమానికి పునాది వేసిన గద్దరని కొనియాడారు. అన్యాయాలను ప్రతినిత్యం ప్రశ్నించేవాడని. ఉద్యమాలకు ఊపిరి తెచ్చిన తన పాటలతో ప్రజలను ఎంతో చైతన్య పరిచేవాడని కొనియాడారు.




# మలి దశ ఉద్యమ మార్గదర్శి ప్రొఫెసర్ జయశంకర్

**సర్పంచ్ ఎన్నిక ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు గుడిపూడి కోటేశ్వరరావు**

**మణుగూరు,విశాలభారతి:** మణుగూరు మండలం కూనవరం గ్రామపంచాయతీ సర్పంచ్ ఎనిక ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ ఉత్సవాలు గ్రామపంచాయతీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం అనంతరం సర్పంచ్ ఎన్నిక ప్రసాద్ కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ స్వరాష్ట్ర సాధనే లక్ష్యంగా ప్రజల్లో ఉద్యమ భావజాలాన్ని రగిలించి, మలిదశ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన తెలంగాణ సిద్ధాంతకర్త అని అన్నారు. మలి దశ ఉద్యమ మార్గదర్శి, ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని, ఆయన ఆశయాలకు అనుగుణంగా మన ప్రియతమ ముఖ్యమంత్రి కేసీఆర్ మలిదశ ఉద్యమంలో మొక్కవోని దీక్షగా ఉద్యమానికి కొనసాగించారు అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, ఆయన కన్న కలలు నిజం చేసిన మహానీయుడు మన ముఖ్యమంత్రి కేసీఆర్ అని ఆయన అన్నారు.ఈ ఉత్సవాల్లో మణుగూరు మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు వల్లభనేని రమణ, మడి వీరన్నబాబు, ఎండి వాహిద్, వార్డు సభ్యులు వంక సూరయ్య, కూనవరం గ్రామపంచాయతీ నాయకులు జెప్పట్ వెంకన్న, గుర్రం వినోద్, రాజు, కనితి ముసలయ్య,కుంజ కన్నయ్య , పంచాయతీ వర్కర్స్ ఏనిక నరసమ్మ, వజ్జా రమణ తదితరులు పాల్గొన్నారు.




# నాడు నల్గొండ జిల్లాలో విద్యార్థులతో చర్చ గోష్టిలో గద్దర్

**నల్గొండ ,విశాలభారతి:** తెలంగాణ ఉద్యమంలో నల్గొండ జిల్లాలో ఏర్పాటుచేసిన పలు కార్యక్రమాలలో గద్దర్ నిరంతరం పాల్గొని ప్రజలను చైతన్యవంతం చేసేవాడు. జిల్లాలో జరిగిన ఉద్యమానికి గద్దర్ కు విడదీయరాని బంధం ఉంది. భువనగిరి, సూర్యాపేట,నల్గొండ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాలలో నిత్యం గద్దర్ హాజరయ్యేవాడు. ఈ సందర్భంగా 2011 సంవత్సరంలో సకలజనుల ఉద్యమాన్ని ఉధృతం చేయాలని మాత్మగాంధీ యూనివర్సిటీలో నాడు మహాత్మాగాంధీ యూనివర్సిటీ విద్యార్థులతో గద్దర్ తో చర్చా గోష్టి కార్యక్రమాన్ని నిర్వహించారు. నాడు సకలజనుల సమ్మెను ఉధృతం చేయాలని నిర్వహించిన చర్చాగోష్టిలో విద్యార్థులు అడిగిన ఉద్యమ ప్రశ్నలకు గద్దర్ సమాధానం ఇచ్చారు. తెలంగాణ ఉద్యమంలో గద్దర్ పలుమార్లు జిల్లాలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు హాజరయ్యారు. ప్రజా యుద్ధనౌక గద్దర్ మృతి పట్ల ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా ప్రజలు ప్రజాస్వామిక వాదులతో పాటు వివిధ రాజకీయ పార్టీల నేతలు కుల సంఘాల నేతలు విద్యార్థి సంఘం నేతలు నివాళులు అర్పించారు. కాంగ్రెస్ ,సిపిఐ సిపిఎం ,బీఎస్పీ, పిడిఎస్ యూ, డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం, తెలంగాణ విద్యావంతుల వేదికతో పలు సంఘాల నేతలు జోహార్లు అర్పించారు



# గంటల గుడి అభివృద్ధికి సహకరించాలి

- గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు మహేష్ అగర్వాల్

**జఫర్ గడ్, విశాలభారతి:** జనగామ జిల్లా జఫర్ గడ్ మండల కేంద్రంలోని వడ్డేగూడెం గ్రామంలో ఉన్న పురాతనమైన గంటల గుడి ఉంది.ఇప్పుడు ఆ గుడి శిథిలావస్థకు చేరటం జరిగింది.ఆదివారం గంటల గుడిని గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు మహేష్ అగర్వాల్ స్థానికులతో కలిసి గంటల గుడిని పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పురాతనమైన గంటల గుడిని అభివృద్ధి చేస్తే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. అదేవిధంగా ఈ గంటల గుడికి ఎంతో పేరు ప్రతిష్టాలు ఉన్నాయి. కావున స్థానిక ప్రజాప్రతినిధుల, నాయకుల సహకారంతో ఈ గుడిని అభివృద్ధి చేయాలనీ అనుకుంటున్నాను కావున అందరూ సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో గోశాల ఫెడరేషన్ ప్రతినిధి బానోత్ గణేష్,స్థానికులు గణేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# గూడెం విష్ణువర్ధన్ రెడ్డి మా గుండెల్లో ఉంటాడు

**వేలాది మంది సమక్షంలో 'విష్ణు' దశదినకర్మ • ఘన నివాళులర్పించిన ప్రజా ప్రతినిధులు, అభిమానులు, కార్యకర్తలు, ప్రజలు**

**విష్ణు స్మృతులను గుర్తు చేసుకుంటూ కన్నీటి పర్యంతమైన కుటుంబ సభ్యులు, స్నేహితులు, అభిమానులు**







**పటాన్ చెరు, విశాలభారతి :** ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి పెద్ద కుమారుడు గూడెం విష్ణువర్ధన్ రెడ్డి దశదినకర్మ ఆదివారం పటాన్ చెరు పట్టణంలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో గూడెం కుటుంబ సభ్యులు నిర్వహించారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, కుటుంబ సభ్యులు విష్ణు చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం పటాన్ చెరు నియోజకవర్గంలో పాటు వివిధ జిల్లాల నుండి తరలివచ్చిన జిఎంఆర్ అభిమానులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, సన్నిహితులు విష్ణువర్ధన్ రెడ్డికి శ్రద్ధాంజలి ఘటించారు. విష్ణుతో తమకున్న అనుబంధాన్ని స్మరించుకుంటూ కన్నీటి పర్యంతమయ్యారు. యువ నాయకుడిగా ఎదుగుతున్న క్రమంలో మృతి చెందడం పట్ల వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. నియోజ వర్గ ప్రజల కష్టసుఖాల్లో అండగా ఉంటూ మనసున్న మహారాజుగా పేరుందిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి పుత్రశోకం కలగడం అత్యంత బాధాకరమని పలువురు ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వందమందికి పైగా జిఎంఆర్ అభిమానులు, ప్రజాప్రతినిధులు అవయవ దానం అంగీకరిస్తూ సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, శాసనమండలి మాజీ చైర్మన్ భూపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సత్యనారాయణ, నందీశ్వర్ గౌడ్, పి. విష్ణువర్ధన్ రెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులు, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల సీనియర్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.





## ప్రజా గాయకుడు గద్దర్ మృతి బాధాకరం

**బి.ఆర్.ఎస్ రాష్ట్ర నాయకులు, కౌన్సిలర్ చంద్రారెడ్డి**

**బొల్లారం, మున్సిపాలిటీ, విశాల భారతి:** ప్రజా గాయకుడు గద్దర్ మృతి బాధాకరమని బి.ఆర్.ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు, కౌన్సిలర్ చంద్రారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆటపాటలతో ఉద్యమ సమయంలో తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను సాహిత్యం రూపంలో ప్రజలకు ఎంతగానో తెలియజేసి ప్రజల పక్షాన తెలంగాణ సాధన కొరకు పోరాటం చేసిన వ్యక్తి అని ఆయన పేర్కొన్నారు. ఉద్యమ సమయంలో గద్దర్ తో కలిసి మాట్లాడుతున్న ఫోటోలు చంద్రారెడ్డి ఆవేదనతో షేర్ చేశారు. జీవితకాలమంతా పోరాటమే ఊపిరిగా బ్రతికిన వ్యక్తి అని కొనియాడారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

## తెలంగాణ స్వాప్నికుడు జయశంకర్ సార్

**బీఆర్ఎస్ నేత నీలం మధు ముదిరాజ్ తెలంగాణ సిద్ధాంతకర్తకు ఘన నివాళి**



**పటాన్ చెరువిశాలభారతి:** ఆచార్య జయశంకర్ సార్ తెలంగాణ స్వా ప్నికుడని, తెలంగాణ ప్రజల గుండెల్లో ఆయన చిరస్మరణీయుడిగా ఉంటారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా చిట్కుల్ గ్రామంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ జయశంకర్ సార్ మలిదశ తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిన మహోన్నత నాయకులని కొనియాడారు. సిద్ధాంతకర్తగా తెలంగాణ ప్రజల్లో చెరగని ముద్ర వేసుకున్నారని చెప్పారు. ఆయన వల్లే తెలంగాణ ఉద్యమం ముఖ్యమంత్రి కేసీఆర్ సార్ నాయకత్వంలో ఉప్పెనలా ఎగిసిపడి ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు నాంది పలికిందన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ జయశంకర్ సార్ ఆకాంక్షలు, ఆశయాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. బంగారు తెలంగాణ సాధన లక్ష్యంగా ప్రొఫెసర్ జయశంకర్ కలలు గన్న సకల జనుల అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుకు సాగుతున్నారని తెలిపారు. యువత జయశంకర్ సారుకు ఆదర్శంగా తీసుకోవాలని నీలం మధు పిలుపునిచ్చారు.



## జయశంకర్ సారుకు ఘన నివాళి..

**భారతీనగర్, రామచంద్రాపురంలో జయంతి వేడుకలు**

**పాల్గొన్న కార్పొరేటర్లు సింధు ఆదర్శ్ రెడ్డి, పుష్ప నగేష్**

**పటాన్ చెరువిశాలభారతి:** తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 89వ జయంతి వేడుకలు భారతీనగర్, రామచంద్రపురం డివిజన్లలో ఘనంగా నిర్వహించారు. భారతినగర్ డివిజన్ వార్డు కార్యలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్పొరేటర్ సింధు ఆదర్శ రెడ్డి పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ సిద్ధాంతకర్తగా, ఉద్యమ స్ఫూర్తి ప్రధాతగా ఆచార్య జయశంకర్ తెలంగాణ ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచి పోయారని అన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ చేసిన నిరంతర కృషిని, ఆయన ధృడ సంకల్పాన్ని తెలంగాణ ప్రజలు ఎప్పటికీ మరచిపోరని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆదర్శ్ రెడ్డి, రాణి యాదవ్, కాలనీ సొసైటీ సభ్యులు, వార్డ్ మెంబర్లు, తెరాస అనుబంధ సంఘాల అధ్యక్షులు, పాల్గొన్నారు.

**రామచంద్రాపురం డివిజన్లో..**

ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలు రామచంద్రపురం డివిజన్ లో ఆదివారం ఘనంగా జరిగాయి. వార్డు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ బూరుగడ్డ పుష్ప నగేష్ పాల్గొని జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రామచంద్రపురం ప్రొఫెసర్ జయశంకర్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీఎం మల్లేష్, నాయకులు బల్ల నర్సింగ్, గడ్డం కుమార్, సజ్జ యాదయ్య, కుమ్మరి సత్యనారాయణ, కుశాంగుల దాస్, బంటు నర్సింహా, బంటు సత్యనారాయణ, మహిళా నాయకురాలు రాణి యాదవ్, ప్రీతీ గౌడ్, బల్ల శ్రీనివాస్, మోహన్ రెడ్డి, చాకలి నర్సింహా, తదితరులు పాల్గొన్నారు.





## దోమలు వ్యాప్తి చెందకుండా ఆయిల్ బాల్స్

**బొల్లారం మున్సిపాలిటీ, విశాల భారతి:** బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని బొల్లారం చైర్ పర్సన్ రోజా బాల్ రెడ్డి మరియు కమీషనర్ సంగారెడ్డి ల సూచనల మేరక ఆదివారపు నాడు పలుకుంటలలో నీరు నిల్వ ఉన్న ప్రదేశాలలో దోమల లార్వా ఉత్పత్తి చెందకుండా ఆయిల్ బాల్స్ ను సిబ్బందితో శానిటరీ ఇన్స్పెక్టర్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో చల్లారు. 19వ వార్డుల్లో ప్రభుత్వ సూచనల మేరకు పది గంటల పది నిమిషాల కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికి తిరుగుతూ దోమల లార్వా ఉత్పత్తిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జవాన్లు రమేష్, బస్తీ వాసులు మురళి, శారద, సంతోష్ రెడ్డి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



## యువతకు మార్గదర్శి మంత్రి కేటీఆర్

**కేటీఆర్ ను కలిసిన నీలం మధు ముదిరాజ్**

**పటాన్ చెరు, విశాలభారతి :** రాష్ట్ర మున్సిపల్ ఐటి శాఖ మంత్రి కేటీఆర్ ను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ ఆదివారం కలిశారు. శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ తో కలిసి అసెంబ్లీలో మంత్రిని కలిశారు. మియాపూర్ నుంచి ఇస్నాపూర్ వరకు మెట్రో రైలు పొడిగించినందుకు, రైతులకు లక్ష రూపాయలు రుణమాఫీ చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయం అన్నారు. మరెన్నో సంక్షేమ పథకాలు తీసుకువస్తుందని ఆశభావం వ్యక్తం చేశారు. ఓ పక్క అభివృద్ధి, మరోపక్క సంక్షేమంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలిపిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ సార్ కే దక్కిందన్నారు. రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు తీసుకొొచ్చి యువతకు మంత్రి కేటీఆర్ ఉపాధి కల్పిస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని నీలం మధు కోరారు.







# జిన్నారంలో కాంగ్రెస్ దళిత బంధు నిరసన

- రాస్తారోకో, సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దగ్ధం
- కేసిఆర్ దిష్టిబొమ్మకు పాడే కట్టి ఊరేగింపు
- దళితులందరికీ దళిత బంధు వర్తింప చేయాలి
- కాంగ్రెస్ నేత కాట శ్రీనివాస్ గౌడ్




**పటాన్ చెరువిశాలభారతి :** పటాన్ చెరు నియోజకవర్గంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ కాట శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో దళిత బంధు నిరసన కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి. నిరసనలు భాగంగా ఆదివారం జిన్నారం మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిన్నారం మండలంలో ఉన్న 955 కుటుంబాలకు దళిత బంధు ఇవ్వాలని మండల ప్రెసిడెంట్ వడ్డె క్రిష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమానికి కాట శ్రీనివాస్ గౌడ్ ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. రాస్తారోకో కార్యక్రమంలో పాల్గొని కెసిఆర్ దిష్టిబొమ్మకు పాడే కట్టి ఊరేగింపు నిర్వహించిన అనంతరం దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా కాట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కేసీఆర్ దళిత ద్రోహి అని, దళిత బంధు పేరుట దళితులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. జిన్నారం మండలంలో 955 కుటుంబాలు ఉంటే బీఆర్ఎస్ పార్టీ నాయకులకు, వారి అనుచరులకు చెందిన 152 కుటుంబాలకే దళిత బంధు ఇచ్చారని ఆరోపించారు. కొందరికే కాకుండా అర్హులైన దళితులందరికీ దళిత బంధు పథకం వర్తింపజేయాలని కాట శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్, టీపీసీసీ కార్యవర్గ సభ్యులు కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ రెడ్డి, మండల ప్రెసిడెంట్స్ వడ్డె కృష్ణ, నర్సింగ్ రావు, ఎంపీపీ రవీందర్ గౌడ్, వైస్ ఎంపీపీ గంగు రమేష్, ఎంపీటీసీలు గోవర్ధన్ గౌడ్, ప్రతాప్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు వీరారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రాజు గౌడ్, ట్రెజరర్ పట్నం శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ సత్యనారాయణ, క్రిష్ణ రెడ్డి, లక్ష్మణ్, బొల్లారం మున్సిపాలిటీ ప్రెసిడెంట్ జైపాల్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ క్రిష్ణ రెడ్డి, జనరల్ సెక్రటరీ లక్ష్మారెడ్డి, సంగారెడ్డి జిల్లా మైనారిటీ ఛైర్మెన్ హబీబ్ జానీ, పటాన్ చెరు ఎస్సి సెల్ ప్రెసిడెంట్ మహేష్, జయశంకర్ గౌడ్, ఉప సర్పంచులు రమేష్, రవి, యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ నరేష్ యాదవ్, పటాన్ చెరు నియోజకవర్గ మండల ప్రెసిడెంట్స్, మున్సిపాలిటీ ప్రెసిడెంట్స్, టౌన్ ప్రెసిడెంట్స్, జిన్నారం మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ అధ్యక్షులు, కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్ సభ్యులు, కె.ఎస్.జి యువసేన సభ్యులు పాల్గొన్నారు.




# మణిపూర్ ఘటన దేశానికే సిగ్గుచేటు

- కాంగ్రెస్ నేత కాట శ్రీనివాస్ గౌడ్
- బీరంగూడలో శాంతి ర్యాలీ

**పటాన్ చెరువిశాలభారతి :** మణిపూర్ హింసాత్మక సంఘటనలు దేశం తలవంచుకునేలా ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ పటాన్ చెరు నియోజకవర్గ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ అన్నారు. నియోజకవర్గ క్రైస్తవుల ఆధ్వర్యంలో ఇక్రిసాట్ నుండి లింగంపల్లి పోలీస్ స్టేషన్ వరకు నిర్వహించారు. బీరంగూడ కమాన్ వద్ద కా ట శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ ప్రశాంత్, సెక్రటరీ శంకర్, ట్రెజరర్ యోహాన్, అడ్వైజర్ పీటర్ నియోజకవర్గ పాస్టర్లు పాల్గొన్నారు.




# ప్రజా గాయకుడు గద్దర్ మృతి తీరని లోటు

**తొర్రూరువిశాల భారతి:** ప్రజా గాయకుడు, విప్లవ నిప్పు రవ్వ, గద్దర్ చికిత్స పొందుతూ ఆకస్మికంగా మృతి చెందడం తెలంగాణ ప్రజానీకానికి తీరనిలోటని వివిధ పార్టీ నాయకులు అన్నారు. డివిజన్ కేంద్రంలో వివిధ పార్టీల నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమాన్ని తనదైన శైలిలో మాట పాటల రూపంలో యావత్ తెలంగాణ ప్రజానీకాన్ని తెలంగాణ ఉద్యమం వైపు నడిపిన తెలంగాణ యోధుడు గద్దరని కొనియాడారు. పొడుస్తున్న పొద్దు మీద నడుస్తున్న కాలమా అంటూ పాట పాడి తెలంగాణ ప్రజల గుండెలో నిలిచిన మహనీయుడు గద్దర్ అన్నారు ఆయన మృతి తెలంగాణ ప్రజానీకానికి తీరని లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు కాందాడి అచ్చిరెడ్డి, తాళ్ల పెల్లి బిక్షం గౌడ్, దీకొండ శ్రీనివాస్ గౌడ్, ఎర్ర మల్లారెడ్డి, ములుకుంట్ల నర్సయ్య, గుండగాని వెంకన్న, బోలగాని శ్రీనివాస్, పోతరాజు యాకేందర్, అల్లం జ్ఞానేశ్వర్, వల్లపు రాములు, వెంకన్న, లింగన్న, నందా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

- కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంలో బిఆర్ఎస్ ప్రభుత్వం విఫలం.
- రాజకీయ కుట్రలతోనే నాడు బీసీ జాబితాలో చేర్చారని విమర్శ.
- వచ్చే ఎన్నికల్లో బీసీలకు అత్యధిక సీట్లు కేటాయిస్తాం.
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డా.ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్





**నాగర్ కర్నూల్ విశాల భారతి:** వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా.ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలో పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన వాల్మీకి బోయల ఆత్మ గౌరవ సభకు ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. 1956 కంటే ముందు ఎస్టీ జాబితాలో ఉన్న బోయలను నాటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి రాజకీయ కుట్రలతో బీసీ జాబితాలో చేర్చారని విమర్శించారు. అడవులు నమ్ముకొని బతికిన జాతులను నాడు ఎస్టీ జాబితాలో కలపడం అన్యాయమన్నారు. రాయలసీమ, ఉమ్మడి మహబూబ్ నగర్ ప్రాంతంలో 45 లక్షల జనాభా ఉన్న వాల్మీకిలకు ఎస్టీ రిజర్వేషన్ లేక ఎన్నో ఏళ్లుగా విద్య, ఉద్యోగ, రాజకీయ అవకాశాలు కోల్పోతున్నారన్నారు. వాల్మీకి బోయలు ఎస్టీ జాబితాలో చేర్చాలని ఎన్నో ఏళ్ల నించి ఉద్యమాలు చేస్తున్నా ఆధిపత్య పాలకులు రాజకీయంగా వాడుకున్నారు తప్ప, న్యాయం చేయలేదన్నారు.

ముఖ్యమంత్రి కేసీఆర్ చెల్లప్ప కమీషన్ రిపోర్ట్ ఆధారంగా వాల్మీకి బోయలు, ఖాయితీ లంబాడీలను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపి చేతులు దులుపుకున్నారే తప్ప, కేంద్రంపై ఒత్తిడి తేవడంలో విఫలమయ్యారన్నారు. కర్ణాటకలో వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో ఉన్నారని గుర్తు చేశారు. రాష్ట్రంలో 8 లక్షల జనాభా ఉన్న వాల్మీకిలకు ఒక్క ఎమ్మెల్యే కూడా ఎందుకు లేరని ప్రశ్నించారు. కేవలం జనాభాలో 5 శాతం కూడా లేని ఆధిపత్య కులాలే 75:ఏళ్ళుగా పాలకులుగా ఉన్నారని విమర్శించారు. ఉత్తర ప్రదేశ్ లో వాల్మీకి బోయలను ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులను చేసిన ఘనత బీఎస్పీ పార్టీదేనన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో వాల్మీకీబోయలకు చట్టసభల్లోకి పంపే ఏకైక పార్టీ బీఎస్పీనే అని అన్నారు.

అత్యధిక జనాభా ఉన్న బహుజనులు ఎందుకు ముఖ్యమంత్రి కాలేకపోయారో అలోచించాలన్నారు. కొకాపేట, బుద్వేల్ లో భూముల కొల్పయేది పేద వర్గాలైతే, వేలంలో భూములు దక్కించుకునేది మాత్రం కేసీఆర్ బినామీలని విమర్శించారు. అసైండ్ భూములు, ప్రభుత్వ భూములను వేలం వేస్తూ రాష్ట్రంలో కేసీఆర్ దోపిడీ పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో దోపిడీ పాలన పోవాలంటే బీఎస్పీ అధికారంలోకి రావాలన్నారు. రాబోయే ఎన్నికల్లో బహుజనులందరు రాజకీయంగా ఒక్కటై అన్ని ఆధిపత్య పార్టీలను ఓడించాలన్నారు. పట్టణంలో భారీ మహాత్మా పూలే విగ్రహం నుంచి సభాస్థలి వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. సభలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పసుపుల రామకృష్ణ, రాష్ట్ర కమిటీ సభ్యులు గగనం శేఖరయ్య, నర్సింహా జిల్లా ఇంచార్జ్ లు యోసెఫ్, నాగన్న, బ్రహ్మయ్య, జిల్లా అధ్యక్షులు పృథ్వీరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచందర్, జిల్లా మహిళ కన్వీనర్ విద్యారాణి, కొల్లాపూర్ అసెంబ్లీ మహిళ కన్వీనర్ సరస్వతి అసెంబ్లీ ఇంచార్జ్ లు వెంకటేష్ నాయుడు, నౌసోళ్ళ గోపాల్, కొత్తపల్లి కుమార్, శ్రీనివాస్ యాదవ్, మోహన్ రెడ్డి, కొయ్యల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



# గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి

**తొర్రూరువిశాల భారతి:** గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవడం అవసరమని నోద హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఇజ్జగాని రాంబాబు గౌడ్ అన్నారు. తీజ్ పండుగను పురస్కరించుకొని నోద హాస్పిటల్ ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రంలోని దుబ్బ తండాలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాంబాబు గౌడ్ మాట్లాడుతూ..గిరిజన యువతులు తమకు మంచి వరుడుకావాలని దైవాన్ని కోరుతూ భక్తి శ్రద్ధలతో పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని, పండుగ జరుపుకునే గిరిజన మహిళలకు చీరలు అందించడం ఆనందంగా ఉందన్నారు. గిరిజన పండుగలు, సంస్కృతి, సాంప్రదాయాలకు సమాజంలో ప్రత్యేక స్థానం ఉందన్నారు. గిరిజన పండుగలకు ప్రభుత్వం సెలవు ప్రకటించాలని, తీజ్, సీత్లా పండుగలను రాష్ట్ర పండుగలుగా గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ధరావత్ సునీత జై సింగ్, డాక్టర్ పద్మా రాథోడ్, డాక్టర్ విరించి, డాక్టర్ డాక్టర్ భగీరథ, డాక్టర్ ధరావత్ సురేందర్, డాక్టర్ మహేష్, బీఆర్ఎస్ యూత్ జిల్లా నాయకులు ప్రవీణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రజల గోస, యాస, ధిక్కార వాణికి నిర్వచనం గద్దరన్న

## ప్రజాస్వామిక ఉద్యమాలకు ఆయన జీవితం స్ఫూర్తి

### ప్రజా గాయకుడు గద్దర్ మృతిపై తెలంగాణ తెలుగుదేశం అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ సంతాపం

**హైదరాబాద్ విశాల భారతి:** ప్రజా గాయకుడు గద్దర్ మృతి పట్ల తెలంగాణ తెలుగుదేశం అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ సంతాపం తెలిపారు. సమ సమాజం కోసం తపిస్తూ ప్రజా యుద్ధనౌకగా చివరి శ్వాస వరకు పోరాడిన ఆయన మరణం విచారకరమన్నారు. పీడిత, తాళిత వర్గాలకు, పేద ప్రజల హక్కుల సాధనకు చివరి శ్వాస వరకు పోరాడిన గద్దరన్న మృతి ఆ వర్గాలకు తీరని లోటు అన్నారు. తెలంగాణ ప్రజల గోస, యాస, ధిక్కార అస్తిత్వాన్ని తన వాణితో ప్రస్ఫుటంగా ప్రపంచానికి వినిపించిన విప్లవకారుడు గద్దర్ అని కొనియాడారు. గద్దర్ను కోల్పోవడం ఆయన ఒక్క కుటుంబానికే కాదు సమస్త తెలంగాణ సమాజం ఒక కుటుంబ సభ్యుని కోల్పోయినట్టుగా దుంఖంతో ఉందన్నారు. గద్దరన్న జీవితం ప్రజాస్వామిక వాదులకు, అట్టడుగు వర్గాల ఆకాంక్షల సాధన కోసం జరుగుతున్న ఉద్యమాలకు స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు. గద్దరన్న



కుటుంబీకులకు తన ప్రగాఢ సానుభూతిని కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తెలియజేశారు.








# హ్యాపీగా ఫ్రెండ్ షిప్ డే

పటాన్ చెరు-విశాలభారతి: స్నేహితుల దినోత్సవాన్ని ఆదివారం ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. స్నేహితులు ఫ్రెండ్ షిప్ బ్యండ్లు కట్టి స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతున్నారు. రామచంద్రపురం కార్పొరేటర్ పుష్ప నగేష్ కార్యాలయంలో స్థానిక మహిళలు, పార్టీ నాయకులతో కలిసి స్నేహితుల దినోత్సవాన్ని జరుపుకున్నారు. భారతినగర్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి మహిళలతో కలిసి ఫ్రెండ్ షిప్ డేను జరుపుకున్నారు. బీఆర్ఎస్ మహిళ నేత రాణి యాదవ్ తదితరులు కార్పొరేటర్ సింధుకు ఫ్రెండ్ షిప్ బ్యాండ్లు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బూరుగడ్డ నగేష్, సీఎం మల్లేష్, నాయకులు బల్ల నర్సింగ్, గడ్డం కుమార్, సజ్జ యాదయ్య, కుమ్మరి సత్యనారాయణ, కుశాంగుల దాస్, బంటు నర్సింహా, బంటు సత్యనారాయణ, మహిళా నాయకులు రాణి యాదవ్, ప్రీతీ గౌడ్, బల్ల శ్రీనివాస్, మోహన్ రెడ్డి, చాకలి నర్సింహా, తదితరులు పాల్గొన్నారు.



# మిస్టర్ ప్రెగ్నెంట్ ట్రైలర్ చూస్తే..సినిమా చూడాలనే ఆసక్తి కలిగింది

**- కింగ్ నాగార్జున**

యంగ్ హీరో సోహైల్, రూపా కొడవయూర్ హీరో హీరోయిన్లుగా మైక్ మూవీస్ బ్యానర్ మీద అప్పి రెడ్డి, రవి రెడ్డి సజ్జల, వెంకట్ అన్నపరెడ్డి నిర్మిస్తున్న చిత్రం 'మిస్టర్ ప్రెగ్నెంట్'. ఈ సినిమాను దర్శకుడు శ్రీనివాస్ వింజనంపాటి రూపొందిస్తున్నారు. ఈ నెల 18న 'మిస్టర్ ప్రెగ్నెంట్' సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. తాజాగా ఈ చిత్ర ట్రైలర్ ను కింగ్ నాగార్జున విడుదల చేశారు. ఈ సందర్భంగా కింగ్ నాగార్జున మాట్లాడుతూ బిగ్ బాస్ లో కప్పు గెలవకుండానే విన్నర్ అయ్యాడు సోహైల్. చాలా తెలివైన వాడు. ప్రతి గేమ్, ప్రతి టాస్క్ కష్టపడి ఆడేవాడు. గెలవాలనే తపన అతనిలో కనిపించేది. అలాంటి పట్టుదలతోనే ఈ సినిమా చేశాడు. మిస్టర్ ప్రెగ్నెంట్ అనగానే మగవాళ్లు ప్రెగ్నెంట్ ఎలా అవుతారు, అది సినిమాలో ఎలా చూపించారు అనే ఆసక్తి కలిగింది. ట్రైలర్ చాలా బాగుంది. ట్రైలర్ చూశాక సినిమా చూడాలనే ఆసక్తి ఏర్పడింది. ట్రైలర్ ఎమోషనల్ గా ఉంది. దర్శకుడు శ్రీనివాస్ కు ఇది ఫస్ట్ మూవీ. ఆయనే స్క్రిప్ట్ రాశాడు. డిఫికల్ట్ సబ్జెక్ట్ ఇది. బాగా తెరకెక్కించాడని అర్థమవుతోంది. ఈ సినిమా టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్ చెబుతున్నా. అప్పిరెడ్డి గారు, వాళ్ల బ్రదర్, ఫ్రెండ్స్ అందరూ నా గురించి మాట్లాడిన మాటలకు థాంక్స్. మైక్ మూవీస్ లో నాలుగో సినిమా ఇది. సక్సెస్ అవ్వాలని హార్ట్ ఫుల్ గా కోరుకుంటున్నా. డెలివరీ అంటే ఒక ప్రాణం పోయడం. అఖిల్ డెలివరీ టైమ్ లో ఆరు నెలలు ఏ షూటింగ్స్ పెట్టుకోకుండా అమలతోనే ఉన్నాను. ఆ టైమ్ నా లైఫ్ లో బెస్ట్ మూవ్ మెంట్. అన్నారు. నిర్మాత రవిరెడ్డి సజ్జల మాట్లాడుతూ మా ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ కు ముఖ్య అతిథిగా వచ్చిన కింగ్ నాగార్జున గారికి థాంక్స్ చెబుతున్నాం. కొత్త వాళ్లను ఎంకరేజ్ చేయడంలో ఆయన ఎప్పుడూ ముందుంటారు. డైరెక్టర్ ఆర్జీవీ మొదలు..ఇప్పటిదాకా ఎంతోమంది న్యూ టాలెంట్ ను పరిచయం చేసిన ఘనత నాగార్జున గారికే దక్కుతుంది. ఆ మంచితనమే ఆయన ఛార్మింగ్ లుక్స్ కు కారణంగా భావిస్తుంటాను. మా సినిమాకు పనిచేసిన కాస్ట్ అండ్ క్రూ అందరికీ థాంక్స్ చెబుతున్నా. అన్నారు.




వైవిధ్యమైన సినిమాలను చేస్తూ తనదైన గుర్తింపు సంపాదించుకున్న టాలీవుడ్ హీరో నందమూరి కళ్యాణ్ రామ్. ఆయన కథానాయకుడిగా నటిస్తోన్న లేటెస్ట్ పీరియాడిక్ స్పై థ్రిల్లర్ 'డెవిల్'. 'ది బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్' ట్యాగ్ లైన్. రీసెంట్‌గా విడుదలైన ఈ సినిమా గ్లింప్స్‌లో హీరో పాత్ర తీరు తెన్నులు, డెవిల్ పాత్రలో తను ఒదిగిపోయిన విధానం, లుక్‌కి ఎక్స్‌ట్రార్డినరీ రెస్పాన్స్ వచ్చింది. దీంతో సినిమాపై ఉన్న అంచనాలు నెక్ట్స్ రేంజ్‌కు చేరుకున్నాయి. ప్రేక్షకులు, అభిమానులు ఈ సినిమా అప్‌డేట్స్ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూడటం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో నవంబర్ 24న ఈ చిత్రాన్ని ప్రపంచ వ్యాప్తంగా భారీ ఎత్తున రిలీజ్ చేయబోతున్నట్లు పోస్టర్ ద్వారా ప్రకటించారు. 'డెవిల్' చిత్రంలో ఎవరికీ అంతు చిక్కని ఓ రహస్యాన్ని ఆయన ఛేదించే బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్‌గా నందమూరి కళ్యాణ్ రామ్ ఆకట్టుకోబోతున్నారు. గత ఏడాది తెలుగు సినీ ఇండస్ట్రీలో వన్ ఆఫ్ బిగ్గెస్ట్ హిట్ మూవీగా నిలిచిన 'బింబిసార'తో మెప్పించిన కళ్యాణ్ రామ్ ఈ ఏడాది 'డెవిల్'తో మెప్పించటానికి రెడీ అవుతున్నారు. రీసెంట్‌గా డెవిల్ హిందీ వెర్షన్ గ్లింప్స్‌ను మేకర్స్ రిలీజ్ చేయగా నెట్టింట తెగ వైరల్ అయ్యింది. సంయుక్తా మీనన్ ఇందులో కథానాయిక. అభిషేక్ పిక్చర్స్ దర్శకత్వ పర్యవేక్షణలో దేవాన్ష్ నామా సమర్పకుడిగా.. అభిషేక్ పిక్చర్స్ బ్యానర్‌పై నవీన్ మేడారం దర్శకత్వంలో అభిషేక్ నామా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని తెలుగు, హిందీ, తమిళ్, కన్నడ భాషల్లో రిలీజ్ చేస్తున్నారు. శ్రీకాంత్ విస్సా ఈ చిత్రానికి మాటలు, స్క్రీన్ ప్లే, కథను అందించారు. హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీత సారథ్యం వహిస్తుండగా సౌందర్ రాజన్ సినిమాటోగ్రాఫర్‌గా వర్క్ చేశారు.

# ఎల్ఎల్‌పి ద్వారా 'పిజ్జా3' విడుదల



మోస్ట్ పాపులర్, సక్సెస్ ఫుల్ హారర్ థ్రిల్లర్ ఫ్రాంచైజీ 'పిజ్జా'. ఈ ఫ్రాంచైజీ లో వచ్చిన రెండు చిత్రాలు తెలుగు ప్రేక్షకులని విశేషంగా ఆకట్టుకొని, భారీ విజయాలు సాధించి, ప్రత్యేక ఫ్యాన్ భేస్ ని సంపాదించుకున్నాయి. ఇప్పుడు 'పిజ్జా3' తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. కనెక్ట్ మూవీస్ ఎల్ఎల్పీ నిర్మాతలు 'పిజ్జా3' రైట్స్ ని సొంతం చేసుకున్నారు. ఇటివలే తమిళంలో విడుదలైన 'పిజ్జా3' బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకుంది. అశ్విన్ కాకుమణి, పవిత్ర మరిముత్తు ప్రధాన పాత్రలలో మోహన్ గోవింద్ దర్శకత్వంలో ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'పిజ్జా3' తమిళనాట అన్ని వర్గాల ప్రేక్షకులని ఆకట్టుకొని ఘన విజయం సాధించింది. ఈ చిత్రం తెలుగు రైట్స్ ని సొంతం చేసుకున్న కనెక్ట్ మూవీస్ ఎల్ఎల్పీ త్వరలోనే చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. ''పిజ్జా3' విజువల్ వండర్. ప్రేక్షకులకు థ్రిల్ తో పాటు గొప్ప థియేట్రికల్ ఎక్స్ పీరియన్స్ ఇస్తుంది' అని నిర్మాతలు తెలిపారు.

# ఆ ఇద్దరి బయోపిక్స్ కోసం శ్రద్దాకపూర్!



బాలీవుడ్ లో బయోపిక్ ల క్రేజ్ గురించి చెప్పాల్సిన పనిలేదు. జీవిత కథలు అక్కడి మేకర్స్ తెరకెక్కించినంతా గొప్పగా మరే మేకర్స్ తెరకెక్కించలేరు అనడంలో అతిశయోక్తి లేదు. సౌత్ మేకర్స్ కొన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ బాలీవుడ్ అంతా ఫీల్ తీసుకురాలేకపోయాయి. అందుకే బయోపిక్ లకు బాలీవుడ్ పెట్టింది పేరుగా చెప్పుంకుంటాం. అక్కడ బయోపిక్ తెరకెక్కిస్తే బాక్సాఫీస్ షేక్ అవ్వాల్సిందే. అందుకే నటీనటులంతా జీవిత కథల్లో నటించడానికి ఎక్కువగా ఆసక్తి చూపిస్తుంటారు. జాన్వీకపూర్ ...సారా అలీఖాన్ లాంటి యంగ్ హీరోయిన్లు కూడా బయోపిక్స్ అంటే ఎంతో ఆసక్తి చూపిస్తుంటారు. తాజాగా వీళ్లిద్దరికంటే సీనియర్ బ్యూటీ అయిన శ్రద్ధాకపూర్ కూడా బయోపిక్ లపై మనసు పారేసుకుంది. ఇటీవల జరిగిన ఓ ఈవెంట్ లో బయోపిక్స్ ప్రస్తావన రాగా ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది ఎవరి జీవిత కథల్లో నటించాలని ఉంది? అని ప్రశ్నించగా... మా బంధువు పద్మిని కొల్హాపురే.. గాయకురాలు లతా మంగేష్కర్ జీవిత కథల్లో నటించాలని ఉంది. అది నాకు ఎప్పటి నుంచో ఉన్న కోరిక. అదొక లక్ష్యంగా మారిపోయింది. కానీ దాన్ని అందుకుంటానో లేదో తెలియదు. కానీ ఆ ఇద్దరు వ్యక్తులు ఎంతో గొప్పవారు. వాళ్ల జీవితాల్లో ఎన్నో సవాళ్లున్నాయి. వాళ్ల జీవితాల్లో ప్రతీ దశ ఎంతో ఆసక్తికరంగా ఉంటుంది. అలాంటి వ్యక్తుల జీవితాల్లో నటించాలంటే అదృష్టం కూడా కలిసి రావాలి. వ్యక్తిగతంగా వాళ్లు సాధించిన లక్ష్యాలు ఎన్నో ఉన్నాయి. అలాంటి వారి జీవితాల్లో నటిస్తే నాలాంటి నటీమణుల జీవితానికి సార్ధకథ దక్కుతుంది` అని అన్నారు. మరి బాలీవుడ్ మేకర్స్ ఆ దిశగా ప్రయత్నాలు చేస్తారేమో చూడాలి. లతా మంగీష్కర్ ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉన్న గొప్ప గాయని. ఆమె జీవిత కథ ని తెరకెక్కించాలని చాలా మంది మేకర్స్ ప్రయత్నాలు చేస్తున్నారు.ఆ పాత్ర కోసం పేరున్న నటిని దించాలన్నది ప్లాన్. మరి ఆ లిస్ట్ లో శ్రద్దా కపూర్ ఉందా? అన్నది చూడాలి. ప్రస్తుతం శద్రా కపూర్ `స్త్రీ-2 `లో నటిస్తోన్న సంగతి తెలిసిందే.

# కేరళ కుట్టి బర్త్ డే స్పెషల్



యూత్‌ను ఎట్రాక్ట్ చేసే కళ్లు.. ఎవరినైనా ఆకట్టుకునే స్మైల్.. గ్లామర్ ప్లస్ యాక్టింగ్‌తో సినిమాల్లోకి దూసుకువచ్చిన హీరోయిన్.. సౌమ్య మీనన్ (s owmya menon ). అప్పటికే హీరోయిన్, కానీ సూపర్ స్టార్ మహేష్ బాబు ఫ్యాన్ కాబట్టి తన పక్కన యాక్ట్ చేయాలనే కోరికతో 'సర్కారివారిపాట' మూవీలో చిన్న క్యారెక్టర్ చేసింది ఈ అందాల సుందరి. ఈ రోజు కేరళ కుట్టి బర్త్ డే. సర్కారివారిపాట' సినిమాలో కనిపించింది కాసేపైనా అందరి లుక్స్ ని గ్రాబ్ చేసిన ఈ మాలివుడ్ బ్యూటీ లేటెస్ట్ మూవీ అప్డేట్ వచ్చింది. శ్రీ వాయుపుత్ర ఎంటర్టైన్మెంట్ అండ్ శ్రీవత్స క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న హీరోయిన్ ఓరియంటెడ్ సినిమా 'సర' (SARA)లో సౌమ్య మీనన్ రెండు డిఫరెంట్ షేడ్స్ ఉన్న క్యారెక్టర్ చేస్తున్నట్టు మేకర్స్ చెప్తూ, ఈ మూవీ ఇప్పటిదాకా తెలుగు సినిమాల్లో కనిపించని బ్యాక్ డ్రాప్‌లో వి.శశిభూషణ రైటింగ్ అండ్ డైరెక్షన్లో తెరకెక్కుతున్నట్టు చెప్పారు. మూవీ ఫస్ట్ లుక్‌తో పాటు టెక్నీషియన్స్ పేర్లన్నీ త్వరలోనే రివీల్ చేస్తామన్నారు. మలయాళంలో కినవల్లి, ఫ్యాన్సీ డ్రెస్, చిల్డ్రన్స్ పార్క్.. లాంటి సూపర్ హిట్ సినిమాలలో హీరోయిన్ గా చేసింది సౌమ్య. ప్రస్తుతం సౌమ్య చేతిలో ఒక కన్నడ సినిమా, రెండు మలయాళ సినిమాలు, తెలుగు సినిమా ఉంది. అయితే.. తెలుగులో ట్యాక్సీ అనే సినిమా చేసింది. కానీ దానికంటే ముందే సర్కారు వారి పాట రిలీజ్ అయ్యేసరికి అందరి దృష్టిలో పడింది. అదీగాక.. సౌమ్య నటి మాత్రమే కాదు మంచి డాన్సర్ కూడా. కొన్ని మలయాళీ ప్రైవేట్ మ్యూజిక్ ఆల్బమ్స్‌లో ఆడిపాడింది.



# చంద్రముఖి 2 కంగనా రనౌత్ లుక్

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కంగనా రనౌత్ టైటిల్ పాత్రలో నటిస్తోన్న భారీ చిత్రం 'చంద్రముఖి 2'. స్టార్ కొరియోగ్రాఫర్, డైరెక్టర్, యాక్టర్ రాఘవ లారెన్స్ హీరోగా నటిస్తున్నారు. భారీ బడ్జెట్ చిత్రాలతో పాటు కంటెంట్ ఓరియెంటెడ్ సినిమాలను అందిస్తూ తమదైన గుర్తింపు సంపాదించుకున్న అగ్ర నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సుభాస్కరన్ ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని అన్ కాంప్రమైజ్‌డ్‌గా నిర్మిస్తున్నారు. సీనియర్ డైరెక్టర్ పి.వాసు ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. హారర్ జోనర్‌లో సరికొత్త సెన్సేషన్‌ను క్రియేట్ చేసిన చంద్రముఖి చిత్రానికి కొనసాగింపుగా ఇప్పుడు 'చంద్రముఖి 2' సినిమాను రూపొందిస్తోన్న సంగతి తెలిసిందే. శనివారం ఈ సినిమా నుంచి చంద్రముఖిగా మెప్పించనున్న కంగనా రనౌత్ లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ లుక్‌తో కంగనా పాత్రలో ఉన్న అంచనాలు మరింత పెరిగాయి. 2005లో పి.వాసు దర్శకత్వంలో రూపొందిన 'చంద్రముఖి' సినిమా ఎంత పెద్ద బ్లాక్ బస్టర్ హిట్ అయ్యిందో అందరికీ తెలిసిందే. దానికి సీక్వెల్‌గా 'చంద్రముఖి 2' రానుంది.

# "ఏ మాస్టర్ పీస్" నుంచి సూపర్ విలన్ ఫస్ట్ లుక్



శుక్ర, మాటరాని మౌనమిది వంటి డిఫరెంట్ మూవీస్ తర్వాత దర్శకుడు సుకు పూర్వజ్ రూపొందిస్తున్న కొత్త సినిమా "ఏ మాస్టర్ పీస్". అరవింద్ కృష్ణ, అషు రెడ్డి లీడ్ రోల్స్ లో నటిస్తున్న ఈ చిత్రాన్ని సినిమా బండి ప్రొడక్షన్స్ పతాకంపై శ్రీకాంత్ కండ్రేగుల నిర్మిస్తున్నారు. ఏ మాస్టర్ పీస్ సినిమా నుంచి తాజాగా సూపర్ విలన్ క్యారెక్టర్ ఫస్ట్ లుక్ ను రిలీజ్ చేశారు. మనీష్ గిలాడా ఈ సూపర్ విలన్ క్యారెక్టర్ లో నటిస్తున్నారు. ఫస్ట్ లుక్ లో విలన్ డేట్ ఆఫ్ బర్త్ మూడుసార్లు, డేట్ ఆఫ్ డెత్ రెండు సార్లు రాయడం ఇంట్రెస్టింగ్ గా ఉంది. 1960లో పుట్టి 1986లో చనిపోయిన ఈ సూపర్ విలన్ మళ్లీ 1986లో పుట్టి 2010లో మరణిస్తాడు. తిరిగి 2010 లో పుట్టి ఎప్పుడు కన్నుమూస్తాడు అనేది ప్రశ్నార్థకంతో ఫస్ట్ లుక్ డిజైన్ చేశారు. వైవిధ్యమైన కథాంశం ఈ సినిమాలో ఉన్నట్లు విలన్ క్యారెక్టర్ లుక్ ద్వారా తెలుస్తోంది. ప్రస్తుతం రెగ్యులర్ చిత్రీకరణలో ఉన్న ఏ మాస్టర్ పీస్ సినిమా ఒక న్యూ కాన్సెప్ట్ సూపర్ హీరో మూవీ ఎక్స్‌పిరియన్స్ ను తెలుగు ప్రేక్షకులకు అందించబోతోంది. గతంలో ఈ సినిమా నుంచి విడుదల చేసిన హీరో అరవింద్ కృష్ణ ఫస్ట్ లుక్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.